




# విజయభాను








విశాఖపట్నం, గురువారం 25-10-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 39 పేజీలు : 8 వెల : 1 రూపాయి




### ప్రధాని మోదీకి
## సియోల్ శాంతి పురస్కారం

- పెద్ద నోట్ల రద్దు భేష్
- ఆర్థిక పురోగతి, ప్రపంచ శాంతికి మోదీ విశేష కృషి
- ప్రశంసించిన అవార్డు కమిటీ

దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీకి సియోల్ శాంతి పురస్కారం 2018 లభించినట్లు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన ద్వారా తెలియజేసింది. మోదీనామిక్స్ ద్వారా దేశం ఆర్థిక వృద్ధికి ఆయన చేస్తున్న కృషిని అభినందిస్తూ ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు దక్షిణ కొరియా వెల్లడించింది. మోదీ అంతర్జాతీయ సహకారం, ప్రపంచ ఆర్థిక పురోగతికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారం అందిస్తున్నారు. ఇరు దేశాలకు అనుకూలమైన సమయం చూసి ఈ పురస్కారాన్ని మోదీకి ఇవ్వనున్నారు.

భారత్‌లో ఆర్థిక పురోగతి, ప్రపంచ శాంతి, మానవాళి అభివృద్ధికి మోదీ విశేష సేవలు అందిస్తున్నారు. అందుకే ఆయన్ను అత్యంత గౌరవమైన సియోల్ శాంతి బహుమతికి ఎంపిక చేశాం అని అవార్డు కమిటీ చెప్పినట్లు విదేశాంగశాఖ ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా తరువాయి 2లో..

## వీర విరాట్
### పరుగుల రారాజు
### అత్యంత వేగంగా పదివేల పరుగులు చేసిన కోహ్లీ



నిజంగా.. కనీవినీ ఎరగని చరిత్రే ఇది. కేవలం 213 వన్డేల్లో 10,000 పరుగులు సాధించడమంటే కనీవినీ ఎరగని చరిత్ర కాక మరింకేమిటీ! పరుగుల రారాజుగా కీర్తించే సచిన్ తెందుల్కర్‌కే సాధ్యమవ్వని ఘనత ఇది. అత్యంత వేగంగా అంతర్జాతీయ క్రికెట్‌లో పదివేల పరుగుల మైలురాయి చేరడమంటే మాటలా? ఎంత నిలకడ.. ఎంత దూకుడు.. ఎంత టెక్నిక్.. ఎంత ఓర్పు.. ఎంత శ్రమ.. ఎంత కోరిక.. ఎంత కసి.. చెప్పుకొంటూ పోతే ఇలా ఎన్ని ఎంతలు వచ్చేస్తాయో టీమిండియా సారథి విరాట్ కోహ్లీ గురించి. -- ( వార్త 8వ పేజీలో )

**పది వేల పరుగుల వీరులు**

| | |
|---|---|
| విరాట్ కోహ్లీ | (213 వన్డేలు- భారత్) |
| సచిన్ తెందుల్కర్ | (266- భారత్) |
| సౌరవ్ గంగూలీ | (272- భారత్) |
| రికీ పాంటింగ్ | (272- ఆస్ట్రేలియా) |
| జాక్వెస్ కలిస్ | (286- దక్షిణాఫ్రికా) |
| ఎంఎస్ ధోనీ | (320- భారత్) |
| బ్రియన్ లారా | (287- వెస్టిండీస్) |
| రాహుల్ ద్రవిడ్ | (309- భారత్) |

## గెలిచే అభ్యర్థులకే టికెట్లు

- పార్టీని అన్ని విధాలా బలోపేతం చేయాలి
- మీ.. మీ.. సమర్థతను రుజువు చేసుకోవాలి
- పార్టీ నేతలపై అచంచల విశ్వాసం ఉంది
- టెలీకాన్ఫరెన్స్‌లో నేతలకు సీఎం దిశానిర్దేశం



అమరావతి: వచ్చే సార్వత్రిక ఎన్నికలపై తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు దృష్టిసారించారు. పార్టీని అన్నివిధాలా బలోపేతంచేసే దిశగా ఆయన చర్యలు ముమ్మరం చేశారు. ఏ ఎన్నిక వచ్చినా గెలుపు తెలుగు దేశానిదే కావాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీ నాయకులతో ఆయన బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు, తరువాయి 2లో..

## నేనున్నానంటూ జగన్ భరోసా
### 293వ రోజు ప్రజాసంకల్ప యాత్ర



సాలూరు (విజయనగరం జిల్లా) : రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్న చంద్రబాబు పాలనను తుదముట్టించేందుకు, ప్రజల సమస్యలు తరువాయి 2లో..

## రాజకీయం కాదు.. రాజనీతి ఉండాలి

- ఆశ లేదు.. ఆశయం మాత్రమే ఉంది
- నగర బహిష్కరణ చేసినందుకే రాజకీయాల్లోకి వచ్చా
- జనతా సర్కార్ రావాలి.. పరివార సర్కార్ పోవాలి
- స్వామి పరిపూర్ణానంద వెల్లడి



హైదరాబాద్ : తన నగర బహిష్కరణ.. అమిత్ షా చేత తన రాజకీయ ఆవిష్కరణైందని బీజేపీ నేత, స్వామి పరిపూర్ణానంద తెలిపారు. బుధవారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఆయనను పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతించాయి. ఈ సందర్భంగా పరిపూర్ణానంద మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా.. దళిత వాడలు, నిరాదరణకు గురైన బస్తీల్లో తిరిగానని, అక్కడి పరిస్థితులు చూసి తీవ్రంగా చలించానన్నారు. తాను రాజకీయాల్లో ఇమడగలనా లేదా అని ఆలోచించానని, తనకు దేవుడు తప్ప ఇంకెవరు లేరని తెలిపారు. రాజకీయాల్లో ఫాదర్, లేదా గాడ్ ఫాదర్ అయినా ఉండాలని, ఈ విషయంలో తన తల్లిదండ్రులు, గురువుల రాజకీయాల్లోకి రావాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఇప్పుడు రాకపోతే.. ఇంకెప్పుడు అడుగు పెట్టొద్దని, ఏది ఆశించ వద్దని ఆ ముగ్గురు చెప్పారని స్పష్టం చేశారు. తరువాయి 2లో..

## పరస్పరం ఆరోపణలు తగదు

- అందుకే సీబీఐ అధికారులను సెలవుపై పంపాం
- కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ



దిల్లీ: సీబీఐ అధికారులను సెలవుపై పంపించడంపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ స్పందించారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీబీఐలో ఇద్దరు సీనియర్ అధికారులు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. అందుకే అలోక్ వర్మ, రాకేశ్ ఆస్థానాను సెలవుపై మాత్రమే పంపించాం. ఈ కేసు విచారణ పారదర్శకంగా జరుగుతోంది. ఈ కేసును విచారించేందుకు సరికొత్త బృందాన్ని నియమించాం. సీబీఐ ప్రత్యేక అధికారి రాకేశ్ ఆస్థానాపై నమోదైన కేసు విచారించేందుకు సీబీఐ డీఐజీ తరుణ్ గోబా, ఎస్పీ సతీశ్ దాగర్, జాయింట్ డైరెక్టర్ వి.మురుగేశంను నియమించాం.

సీబీఐ ఒక ప్రధాన దర్యాప్తు సంస్థ. ఇప్పుడు దాని సమగ్రత, విశ్వసనీయతను కాపాడటం ఎంతో అవసరం. తరువాయి 2లో..

## బీఎస్పీతో పవన్ మంతనాలు
### ఉత్తర్‌ప్రదేశ్ వెళ్లిన జనసేనాని పవన్



అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఉత్తరప్రదేశ్ పర్యటనకు వెళ్లారు. బుధవారం ఉదయం లక్నో చేరుకున్న పవన్ వెంట పార్టీ ముఖ్యనేత నాదెళ్ల మనోహర్‌తో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు. ఈ పర్యటనలో బీఎస్పీ ముఖ్య నేతలతో పవన్ కళ్యాణ్ సమావేశం కానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎస్సీల పార్టీగా ముద్రపడ్డ బీఎస్పీతో పవన్ మంతనాలు జరపనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. బీఎస్పీ నేతలను కలవటం ద్వారా రాష్ట్రంలోని ఎస్సీలను పార్టీ వైపు ఆకర్షిస్తామని జనసేన వర్గాలు చెబుతున్నాయి.






## మోదీ పాలన అసమర్థతకు నిదర్శనం
### ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు



అమరావతి: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)లో జరుగుతున్న పరిణామాలపై ఆర్థిక మంత్రి యనమల రామ కృష్ణుడు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అరుణ్ జైట్లీ వ్యాఖ్యలపైనా మండిపడ్డారు. సీబీఐపై వస్తున్న ఆరోపణలు నరేంద్ర మోదీ అసమర్థ పాలనకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. మోదీ పాలనతో వ్యవస్థలు పతనమయ్యాయని చెప్పడానికి సీబీఐ ఉదంతమే ఉదాహరణ అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికే అప్రతిష్ట తెచ్చిందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసిందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీబీఐలో చోటుచేసుకున్న పరిణామాలు సిగ్గుచేటన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కన్నీరు పెట్టడం, నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు బహిరంగంగా విలేకరుల సమావేశం పెట్టడం, సీబీఐ డైరెక్టర్, ప్రత్యేక డైరెక్టర్ పరస్పర ఆరోపణలు చేసుకోవడం ఎప్పుడైనా చూశామా? అని యనమల అన్నారు. మోదీ పాలనతో దర్యాప్తు సంస్థల ప్రతిష్ఠను దిగజార్చారని, న్యాయ వ్యవస్థను వంచించారని ఆరోపించారు. రాఫెల్ కుంభకోణంపై జేపీసీ వేసేందుకు ఎందుకు వెనుకాడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. తరువాయి 2లో..




## అధికారం...పల్లవించిన వేళ....రంగస్థలంపై కొత్త గొంతు



విజయనగరం : వారు పాడుతుంటే ప్రేక్షకుల చినుల చప్పట్ల మధ్య పరవశంతో తడిసి ముద్ద అయినట్టుంది.. గొంతువిప్పి తన మధుర స్వరంతో పాట అందుకోగానే....ఒక్కసారి నిశ్శబ్దం వేదిక నుంచి ప్రేక్షకుల వరకు పరుచుకుంది. అంతే పాట మొదలు పెట్టగానే కుర్రకారు విజల్స్ వేశారు. పెద్దలు ఆ పాటకు తాళం వేయడం మొదలుపెట్టారు. ఆ పాటకు కొందరు వచ్చిరాని సంగీతంతో రాగాన్ని అందిపచ్చుకుని గొణుక్కుంటున్నారు. అందరినీ కదిలించిన ఆ పాట గాయకులు ఎప్పుడూ వేదికలపై లేదా టి.వి., సినిమాల్లో పాడలేదు. జిల్లాను ఒక్కత్రాటిపై నడిపించే లక్ష్యంతో ఉత్సవాలను, సిరిమాను సంబరాలను తమ బుజస్కంధాలపై వేసుకుని నిరంతరం సమీక్షలు..సమావేశాలు..టెక్షన్‌తో గడుపుతూనే ఉంటారు. కానీ శని, ఆదివారాల్లో విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమోధ్యామైదానం వేదికపై జరిగిన .సినీ గాయనీ, గాయకుల సంగీత విభావరిలో ఒక్కసారి తన గానాన్ని విన్పించారు. వారే జిల్లా కలెక్టర్ ఎం. హరిజవహర్‌లాల్. వారిలో గాయకులు కొత్తగా పురుడుపోసుకున్నట్టు లేదు. ఎంతో అనుభవం ఉన్నట్టు తెలుస్తుంది. గమకాలు, ముక్తాయింపు.. .తాళం..రాగం పరిపక్వతతో నిండి ఉన్నాయి. మొదటిసారి పాడగానే ప్రేక్షకులు ఒన్స్‌మోర్ అనే కేకలు వేశారు. నేపథ్యవాయిద్యకళాకారులు కూడా సునాయాసంగా ఆ పాటకు నేపద్యం అందించారు. దాంతో రసపట్టుతో సాగిన ఆ పాటను ఆస్వాదించి ఉత్సవాల్లో విజయనగరం సత్తా చాటిచెప్పారు. ఎందరో తర్వాత పెల్ఫీలీ దిగారు.

ఇదిలావుండగా... క్రీడాస్థలిలో...

స్థానిక ఇండోర్ స్టేడియంలో ఉత్సవాల్లో భాగంగా జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో రాష్ట్రమంత్రి సుజయ్‌కృష్ణరంగారావు, జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ ఒక బృందంగా, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, గజపతినగరం ఎమ్మెల్యే కె..ఎ.నాయుడు ఒక బృందంగా షటిల్‌బాడ్మెంటెన్ పోటీలు జరిగాయి. ఇందులో హోరాహోరి తలపడిన రెండు బృందాల్లో ఎమ్మెల్సీ టీమ్ ఎమ్మెల్యే, టీము రెండుపోటీల్లో గెలవగా, రాష్ట్రమంత్రి, కలెక్టర్ టీమ్ ఒక పోటీలో విజేత అయింది. బెస్ట్ ఆఫ్ త్రీలో ఎమ్మెల్సీ టీమ్ విన్నర్స్‌గా, కలెక్టర్ టీమ్ రన్నర్‌గా నిలిచింది.

ఈ పోటీల్లో ఆర్డీఓ జె.వి.మురళీ, జెడ్పీ సిఇఓ వెంకటేశ్వరరావు, ఎస్సీ కార్పరేషన్ ఏడి సునీల్ రాజ్‌కుమార్, పశుసంవర్ధకశాఖ జె.డి.నర్సింహులు, డిపిఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

## మహెూన్నత వ్యక్తిత్వం...

### వాల్మీకి..ఆదర్శం: జె.సి. కె.వెంకటరమణారెడ్డి



విజయనగరం : మహెూన్నత వ్యక్తిత్వం కలిగిన మహనీయుడు వాల్మీకి అని జాయింట్ కలెక్టర్ జె.వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం వాల్మీకి జయంతి సందర్భంగాజిల్లా బి.సి కార్పరేషన్ ఆధ్వర్యంలో కలక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదికవి వాల్మీకి శ్రీరామచంద్రుని వ్యక్తిత్వాన్ని, పెద్దల పట్ల ఉన్న గౌరవాన్ని ఆడినమాట తప్పని గుణాన్ని మలిచి రామాయణాన్ని అందించారని తెలిపారు. అందుకే అది రమనీయంగా తరతరాలకు వెలుగు అందిస్తున్నాదని అన్నారు. మానవాళికి ప్రధమ ఉదాహరణ వాల్మీకి అని అతని జీవితం వేటగాని స్థాయి నుంచిమహర్షిగా మారిన విధానాన్ని వివరించారు. తులసీదాసు కూడా వాల్మీకికి ప్రతిరూపమన్నారు. వెనుకబడిన తరగతుల గూర్చి ప్రస్తావిస్తూ జిఓ నె.30 కి సంబంధించి కొద్దిరోజుల్లో టెండర్లు పిలుస్తామని, జిల్లా అధికారులతో సి.ఎం.సమీక్షా సమావేశం చేస్తున్నారని తెలిపారు. జె.సి-2 జె.సీతారామారావు మాట్లాడుతూ ఆశ్వయుజ శుద్ధ పైర్ణమినాడు జన్మించిన వాల్మీకి ద్వారా మహనీయత్వానికి జ్ఞాన సంపదే ముఖ్యము కానీ జన్మ ముఖ్యం కాదని తెలుయజేసారని అన్నారు. ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి మాట్లాడుతూ విద్యలనగరంగా జిల్లాను తీర్చిదిద్దడానికి ఇలాంటి కార్యక్రమాలు జరగాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.గణపతిరావు " వాల్మీకి రచించిన ఆదికావ్యాన్ని జర్మనీ, యూరప్ దేశాలు కూడా ఆదరించాయని తెలిపారు. సమావేశ అనంతరం సాంస్కృతికకార్యక్రమాలు జరిగాయి. సమావేశంలో డిఆర్ఓ జె.వెంకటరావు, బి.సి,వెల్ఫేర్ అధికారి ఆర్.వి.నాగమణి, బి.సి. సంఘనాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఐక్యరాజ్య సమితి ద్వారా ప్రపంచానికి భారతీయ విలువలు

### గీతం జాతీయ సదస్సులో ఛాన్సలర్ కె.రామకృష్ణారావు



సాగర్‌నగర్ : ప్రపంచంలోని వివిధ సమస్యలకు పరిష్కారం చూపలేని నాడు ఐక్యరాజ్య సమితిలో శాస్వత సభ్యత్వం ఉన్నా దానికి ఉపయోగం ఉండదని సమితి ద్వారా భారతీయ విలువలను, గాంధీ శాంతి మార్గాన్ని చాటి చెప్పాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.రామకృష్ణారావు అభిప్రాయ పడ్డారు. ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సం సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ గాంధీయన్ స్టడీస్‌లో ఏర్పాటు చేసిన '21వ శతాబ్ధలో ఇక్యరాజ్య సమితి,భారత విదేశాంగ విధానం, ప్రపంచ రాజకీయాలు' అనే జాతీయ సదస్సును ఆయన ముఖ్య అతిధిగా హజరయి ప్రారంభించారు.

ప్రపంచంలో శాంతి, ఆర్థిక సుస్థిరత, పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించ గలిగితే అలాంటి దేశాలకు శాశ్వత సభ్యత్వం లేక పోయినా నష్టం లేదన్నారు.ఐక్యరాజ్య సమితి ఆవిర్భావం అనంతరం ప్రపంచంలోని పలు సంక్షోభాలను విజయవంతంగా నివారించ గలిగినప్పటికీ ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు.

గౌరవ అతిధిగా హజరైన నేషనల్ మేరీటైమ్ ఫౌండేషన్ రీజనల్ డైరక్టర్ జి.పద్మజ మాట్లాడుతూ 90 శాతం అంతర్జాతీయ వాణిజ్యం సముద్ర మార్గం ద్వారానే జరుగుతోందన్నారు.వివిధ దేశాల మధ్య నావికా దళాలు పరస్పర సహకారంతో పనిచేస్తే సముద్ర భద్రత పట్టిష్ఠం అవుతుందన్నారు. ఐక్యరాజ్య సమితి రూపొందించిన సముద్ర చట్టాలు అందుకు ఉపకరిస్తాయని తెలిపారు.

గీతం స్కూల్ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ డైరక్టర్ డాక్టర్ బి.నళిని మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి ఆవిర్భావంతో ప్రపంచ దేశాలలో పేదరిక నిర్మూలనపై దృష్టి సారించినప్పటికి ఆర్థిక అసమానతలకు పరిష్కారం చూపలేదన్నారు.అభివృద్దితో పాటు పెరుగుతున్న వాతావరణ మార్పులు, కాలుష్యంపై ప్రపంచ దేశాలను ఒక్క తాటిపైకి తేవడానికి కృషి జరగాల్సి ఉందన్నారు. భారత దేశం విలువలతో కూడిన విదేశాంగ విధానాన్ని అనుసరించి ప్రపంచ దేశాలకు మార్గదర్శకం చూపాలన్నారు.

సదస్సు కన్వీనర్ డాక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి చూపిన చొరవ కారణంగానే ప్రపంచ శాంతి, మానవ హక్కుల పరిరక్షణ, మహిళా హక్కులు, పోషకాహర లోపాల వంటి అంశాలకు వివిధ దేశాలు ప్రాధాన్యతను ఇస్తున్నాయని అభిప్రాయపడ్డారు.సదస్సులో గీతం స్కూల్ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ సోషల్ సైన్సస్ విభాగం అధిపతి డాక్టర్ సంగీత, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నిపుణులు పాల్గొని ప్రసంగించారు.

## సైనికస్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: కోరుకొండ సైనికస్కూల్లో 6,9వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులను కోరుతున్నామని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వతరగతి లో 70 సీట్లు ఉన్నాయని,2019 మార్చి 31వ తేదీకి 10-12 ఏళ్ళ మధ్య బాలురుండాలని, 9వ క్లాస్‌కు 20 సీట్లు ఉన్నాయని, వీరికి 13-15 వయసు మధ్య ఉండాలని తెలిపారు. 10 ప్లస్ 2 బోధన ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను నవంబరు 26వ తేదీ వరకు ఉంటుందని జనవరి 6వ తేదీ ప్రవేశపరీక్ష నిర్వహిస్తామన్నారు. 2019-20 విద్యా సంవత్సరానికి ఆలిండియా స్థాయిలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. విజయనగరం, విశాఖ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం, హైదరాబాద్, కరీంనగర్‌లలో పరీక్షలు నిర్వహణ ఓఎంఆర్ సద్ధతిలోను, మెడికల్ బోర్డు ఆమోదంచిన మెడికల్ ఫిట్‌నెస్‌కు లోబడి ఉంటాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీస్‌మెన్ పిల్లలకు రిజర్వేషన్ ఉంటుందని, స్కాలర్ షిప్స్ లభిస్తాయన్నారు. మరింత సమాచారానికి 08922-246119, 08922-245168 నెంబర్లు అలాగే www.sainikschoollad-mission.in సంప్రదిచ్చవచ్చని తెలిపారు.

**మొదటి పేజీ తరువాయి**

## ప్రధాని మోదీకి సియోల్ శాంతి పురస్కారం

భారత్‌లో మోదీ తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలపై ప్రశంసలు కురిపించింది. మోదీనామిక్స్ ద్వారా ధనిక, పేద ప్రజల మధ్య ఉన్న సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగేలా కృషి చేస్తున్న ఘనత మోదీదే. అవినీతిని కట్టడి చేసేందుకు ప్రధాని మోదీ తీసుకొచ్చిన పెద్ద నోట్ల రద్దుపై అవార్డు కమిటీ ప్రశంసల జల్లు కురిపించింది. రెండేళ్లకు ఒకసారి ఈ పురస్కారాన్ని ప్రకటిస్తారు. గతంలో ఐక్యరాజ్యసమితి మాజీ సెక్రటరీ జనరల్ కోఫీ అన్నన్, జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ తదితరులు ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

## గెలిచే అభ్యర్థులకే టికెట్లు

ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ బాధ్యులు, ఇతర నాయకులతో ఆయన మాట్లాడారు. ఏపీలో ప్రస్తుతం 64 లక్షలుగా ఉన్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కోటికి చేరుకోవాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈనెల 31 నుంచి అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో గెలిస్తేనే అనుకున్న అభివృద్ధి సాధించగలమన్న ఆయన.. పార్టీలో ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో గెలుపు ఏకపక్షం కావాలని, గెలిచే అభ్యర్థులకే టికెట్లు ఇస్తామని తేల్చిచెప్పారు. ఓటర్ల నమోదు కార్యక్రమంపై దృష్టి పెట్టాలని నేతలకు సూచించారు. కార్యకర్తలు, పార్టీ వ్యవస్థపై తనకు అంచంచల విశ్వాసం ఉందని ఈ సందర్భంగా చంద్రబాబు వ్యాఖ్యానించారు.

గత నాలుగేళ్లలో రాష్ట్రంలో అనేక సమస్యలు చుట్టుముట్టినా అన్నింటినీ పట్టుదలగా అధిగమించామని చంద్రబాబు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో 76శాతం సంతృప్తి ఉందని, పార్టీ మీద కూడా అంతకన్నా ఎక్కువ సంతృప్తి నమోదుకావాలన్నారు. ఎవరి పరిధిలో వారు తమ సమర్థతను రుజువు చేసుకోవాలని సూచించారు. గత 4 ఏళ్లలో దేశంలోని అన్ని వ్యవస్థలను కేంద్రం కుప్పకూల్చిందని సీఎం ఆరోపించారు. సీబీఐ సహా అన్ని సంస్థలను గందరగోళం చేసిందని మండిపడ్డారు. ఐటీ దాడులతో భయోత్పాతం సృష్టించి పబ్బం గడుపుకోవాలని భాజపా చూస్తోందని ఆయన దుయ్యబట్టారు. జాతీయ స్థాయిలో తెలుగుదేశం క్రియాశీలం కావాలని ఆయన ఆకాంక్షించారు. త్వరలో జరగనున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికలపై అందరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చంద్రబాబు స్పష్టంచేశారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాలలో ఓటర్ల నమోదు ముమ్మరంగా సాగాలని నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## నేనున్నానంటూ జగన్ భరోసా

తెలుసుకుని వారికి నేనున్నానంటూ భరోసానిచ్చేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర విజయనగరం జిల్లాలోని సాలూరు నియోజకవర్గంలో విజయవంతంగా కొనసాగుతోంది. జననేత 293వ రోజు పాదయాత్ర బుధవారం ఉదయం సన్యాసిరాజుపేట శివారు నుంచి ప్రారంభించారు. అక్కడి నుంచి బాగువలస మీదుగా నక్కడవలస క్రాస్, తడిలోవ, మక్కువ మండలంలోని గునికొండవలస మీదుగా చప్ప బుచ్చమ్మపేట వరకు జననేత పాదయాత్ర కొనసాగనుంది.

***పాదయాత్రలో మరో మైలురాయి...***

ప్రజా నాయకుడిగా ప్రజల పక్షాన నిలిచేందుకు, కష్టనష్టాల్లో వారికి తోడుగా నిలుస్తానని భరోసా నింపేందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర మరో ఘనత సొంతం చేసుకుంది. బుధవారం ఉదయం సన్యాసిరాజుపేట శివారు నుంచి మొదలైన వైఎస్ జగన్ పాదయాత్ర బాగువలస వద్ద 3,200 కిలోమీటర్ల మైలురాయిని చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన బాగువలసలో ఒక మొక్కను నాటి అభిమానులు, కార్యకర్తలతోడుగా ముందుకు కదిలారు.

## పరస్పరం ఆరోపణలు తగదు

అందుకోసం ఇద్దరు సీబీఐ అధికారులపై ఉన్న కేసులను పారదర్శకంగా విచారణ జరపాల్సిన అవసరం ఉంది. సీబీఐ డైరెక్టర్‌ను నిందితుడిగా ప్రత్యేక డైరెక్టర్ చెబుతున్నారు. ప్రత్యేక డైరెక్టర్‌ను నిందితుడిగా సీబీఐ పేర్కొంది. సీబీఐలోని ఇద్దరు ఉన్నతాధికారులు ఇప్పుడు నిందితులే. ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం చాలా దురదృష్టకరమైన పరిస్థితి. సీబీఐ సమగ్రతను కాపాడటం కోసం న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం. అందులో భాగంగానే వాళ్లను సెలవుపై పంపించాం. వారిద్దరిపై ఉన్న కేసులను సిట్ బృందం విచారిస్తోంది. ఈ విషయంపై చర్చించేందుకు సీవీసీ నిన్న అత్యవసరంగా సమావేశమైంది. ఇద్దరు సీబీఐ అధికారులపై వస్తోన్న ఆరోపణలను ఏ ఏజెన్సీ అయినా విచారణ చేయవచ్చని సీవీసీ వెల్లడించింది. అందువల్లే అలోక్ వర్మ, ఆస్థానాను సెలవుపై పంపిస్తున్నాం. ఇది తాత్కాలికంగా తీసుకున్న నిర్ణయం మాత్రమే. సీవీసీ ప్రతిపాదన మేరకే ప్రభుత్వం సీబీఐ అధికారులపై ఈ చర్య తీసుకుంది అని జైట్లీ పేర్కొన్నారు.

రాకేశ్ ఆస్థానా కేసు విచారించే బృందంలో ఉన్న డీఐజీ తరుణ్ గోబా వ్యాపం కేసును దర్యాప్తు చేశారు. గురురామ్ రహీం కేసు దర్యాప్తును ఎస్పీ సతీష్ దాగర్ చేయగా.. బొగ్గు కుంభకోణం కేసును విచారించిన అనుభవం వి.మురుగేశంకు ఉంది. సీబీఐ డైరెక్టర్‌ను సెలవుపై పంపించడంతో.. కొత్త డైరెక్టర్ బాధ్యతలను జాయింట్ డైరెక్టర్ మన్నెం నాగేశ్వరరావుకు అప్పగించారు.

## మోదీ పాలన అసమర్థతకు నిదర్శనం

ఆర్థిక నేరగాళ్లు పీఎంవో చుట్టూ తిరుగుతున్నప్పుడే మోదీ నిష్పాక్షికత ఏంటో తెలిసిందన్నారు. ఆర్థిక నేరాల కేసుల దర్యాప్తును ఏడాదిలోగా పూర్తి చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోనప్పుడే వారి నిజాయితీ ఏపాటిదో తేలిపోయిందన్నారు.

## రాజకీయం కాదు.. రాజనీతి ఉండాలి

ఇంకా స్వామిజీ ఏమన్నారంటే.. ఈ నెల8న అమిత్‌షాను కలిసినప్పుడు.. నా మీద చూపిన గౌరవం, వారితో మాట్లాడాకా నా ధైర్యం మరింత రెట్టింపు అయ్యింది. మీ సేవ ఈ దేశానికి అవసరమని అమిత్ షా తెలిపారు. నవరాత్రులు అయ్యాక నిర్ణయం చెబుతానన్నాను. స్వామిజీ తెలంగాణకు వెళ్లండి.. లక్ష్మణ్‌ను కలిసాక పార్టీ మీకు సూచన చేస్తుందని అన్నారు. రాజకీయం కాదు రాజనీతి ఉండాలని అనుకుంటున్నాను. దేశాన్ని రక్షించుకోవాలి, ధర్మాన్ని పరి రక్షించుకోవాలి అంటే బీజేపీ రావాలనుకున్నాను.

బీజేపీలో కులాలు, కుటుంబాలు లేవు అవినీతి లేదు. గుణమే హద్దు. తెలంగాణలో జనతా సర్కార్ రావాలి.. పరివార సర్కార్ పోవాలి.. అదే మా నినాదం. మిషన్70లో తెలంగాణ బీజేపీ అధికారంలోకి వస్తోంది. అమిత్ షా బాధ్యత తీసుకోమన్నారు. ఏ పదవి, బాధ్యత వద్దని తెలిపాను. పని చేయడానికి వచ్చాను. పదవి కోసం కాదు. లక్ష్మణ్ ఏ గీత గీసిన పాటిస్తాను. ఆశ లేదు ఆశయం మాత్రమే ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వాలు.. దారుసలాంతో నడిచాయి. ఇప్పుడు వచ్చే బీజేపీ సర్కార్ లాల్ దర్వాజ ఆజ్ఞలతో నడుస్తది. అమావాస్య నాకు మంచి ముహూర్తం. ఎన్నికల కమిషన్ కూడా మాకు మంచి రోజునే కేటాయించింది. తెలంగాణ.. కాషాయ తెలంగాణగా మారబోతోంది. అని తెలిపారు.

# ప్రశాంతంగా సిరిమానోత్సవం

### విజయనగరం జిల్లా ఎస్పీ జి. పాలరాజు

విజయనగరం: ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శ్రీ పైడితల్లమ్మ సిరిమానోత్సవం ప్రశాంతంగా జరిగిందని పోలీసుశాఖ చేపట్టిన పటిష్ఠమైన బందోబస్తుఏర్పాట్లు, ముందస్తు జాగ్రత్తా చర్యలు సత్ఫలితాలిచ్చాంయని విజయనగరం జిల్లా ఎస్పీ జి. పాలరాజు, తెలిపారు. సిరిమానోత్సవం ప్రారంభానికి ముందే కొన్ని చోట్ల బ్యారికేడ్లు మూసివేయడంతో సిరిమాను తిరిగే ప్రధాన రహదారికి చేరుకొనేందుకు భక్తులు ఇబ్బందులు పడుతున్నట్లుగా జిల్లా ఎస్పీదృష్టికి రాగాజిల్లా ఎస్పీ జి. పాలరాజు తక్షణమే స్పందించి మూడు లాంతర్లునుండి కోట జంక్షను వరకు కలియ తిరిగి భక్తులు సిరిమాను తిరిగే ప్రాంతానికి చేరే విధంగా బ్యారికేడ్లు నుండి భక్తులను అనుమతించాలని పోలీసు అధికారులును ఆయన ఆదేశించారు. సిరిమాను తిరిగే మూడుసార్లు ఎస్పీ కూడా రధాలు వెంబడే ఉండి బందోబస్తు ఏర్పాట్లును స్వయంగా పర్యవేక్షించారు. సిరిమానోత్సవం అనంతరం భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రదాన కూడళ్ళలో బ్యారికేడ్లును తొలగించారు. సిరిమానోత్సవం తరువాత సిరిమాను చెక్కల కోసం పెద్ద సంఖ్యలో భక్తులు ఒకేసారి ఎగబాకడం జరిగింది. భక్తులు రెండువైపుల వెళ్ళేందుకు తక్షణ చర్యలును స్వయంగా చేపట్టారు. వృద్ధులు, గర్భిణీలు, శారీరక అంగవైకల్యం కలిగినవారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా





పోలీసుశాఖప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీసు సేవాదళ్ విశేషమైన సేవలందించింది. ట్రాఫిక్ రెగ్యులేషన్‌కు ప్రత్యేక చర్యలను చేపట్టడం సత్ఫలితాలిచ్చింది. సిరిమానోత్సవం సజావుగా, ప్రశాంత వాతావరణంలో ముగియుటకు అన్ని వర్గాల ప్రజల తమ వంతు సహకారాన్ని పోలీసుశాఖకు అందించారని జిల్లా ఎస్పీ జి. పాలరాజు అన్నారు. విద్యుత్, అటవీ, ఆరోగ్య, మున్సిపల్, ఫైర్, రెవెన్యూ, దేవాదాయమరియు ఇతర శాఖలు సమన్వయంతో పనిచేసాయన్నారు. ప్రజలు, పాత్రికేయులు తమ వంతు సహకారాన్ని పోలీసుశాఖకు అందించారన్కృతజ్ఞతలు తెలిపారు. 15 మంది తప్పిపోయిన పిల్లలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అదే విధంగా చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడే చిల్లర దొంగలు పది మందిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ జి. పాలరాజు తెలిపారు. కంట్రోల్ రూంనుండే డిఐజి సిహెచ్. శ్రీకాంత్, పార్వతీపురం ఎఎస్పీ ఎం. దీపికా పాటిల్, బొబ్బిలి ఎఎస్పీ గౌతమీ శాలీలు పర్యవేక్షించిఆయా ప్రాంతాలలో విధులు నిర్వహించే పోలీసు అధికారులను అప్రమత్తం చేయడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడగలిగామని, పోలీసుశాఖకు సహకరించిన జిల్లా ప్రజానీకానికి ఎస్పీ జి. పాలరాజు కృతజ్ఞతలు తెలిపారు.

## కళాకారులను ప్రోత్సహించాలి



విశాఖపట్నం : విశాఖ ఉషారాణి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు లాన్‌సన్ ప్రాపర్టీస్ వారి సౌజన్యంతో కీ.శే. వంకాయల ఉషారాణి జ్ఞాపకార్థం నెలవారీ ప్రోగ్రామ్‌ను స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ రామాంజనేయ యుద్ధం యుద్ధ సీను, రావణ గర్వ భంగం అను పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు తిరునగరి శ్రీనివాసరావు దంపతులకు, మెట్ట దామోదరరావు దంపతులకు ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి మఖ్య అతిధిగా హాజరైన కళా ఆసుపత్రి అధినేత, వైఎస్ఆర్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తి మాట్లాడుతూ కళాకారులను గౌరవిస్తూ ప్రోత్సహించడం భారతీయ కళలను పరిరక్షించడం జరుగుతోందన్నారు. అనంతరం ప్రముఖ కళాకారుడు, నందీ అవార్డు గ్రహీత భారతీప్రసాద్ కళా రంగానికి చేసిన సేవలను డాక్టర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కె. ఉమేష్, సిఇఓ లాన్‌సన్ ప్రాపర్టీస్, మహంతి, అడ్వకేట్ హైకోర్ట్ ఆఫ్ ఏపీ, పల్లి నల్లనయ్య, జివిఎంసి జోన్-2 కమిషనర్, పల్లి నాగభూషణరావు, శ్రీ మాతా డిజిటల్ కంపెనీ అధినేత, కురిటి సత్యంనాయుడు, కలియుగ అర్జున బిరుదాంకితుడు, పోతిన వరం, సీనియర్ కళాకారుడు, అల్లాడ వెంకటరావు అచ్చిమాంబ కన్‌స్ట్రక్షన్ అధినేత, వెలుబండి అబ్బులు, విజయనగరం కళాకారుల సంఘం కోశాధికారి పాల్గొన్నారు.

# జగనన్న పాలనలో దేశం సర్వతోముఖాభివృద్ధి

- అస్తవ్యస్తంగా 'దేశం' పాలన
- రాష్ట్ర వైఎస్ఆర్ సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పరదేశి



గాజువాకః ప్రస్తుత తరుణంలో రాష్ట్రంలో జరుగుతున్న అకృత్యాలు, ప్రకృతి వైపరీత్యాలు వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని, ఇకముందు ఇలాంటి దురాగతాలు జరగకుండా ఉండాలంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ రాష్ట్ర వైఎస్ఆర్ సీపీ ప్రతిపక్ష నాయకుడైన వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి తమ ఓటు వేసి గెలిపించాలని గ్రేటర్ విశాఖ 51వ వార్డు రాష్ట్ర వైఎస్ఆర్ సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మరడుపూడి పరదేశి పేర్కొన్నారు. బుధవారం ఉదయం పెదగంట్యాడ ఎస్సీ షాపింగ్ ఆవరణలో 51వ వార్డు వైఎస్ఆర్ సీపీ యువజన అధ్యక్షుడు ములకపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర వైఎస్ఆర్ సీపీ ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించిన ప్రజా సంకల్ప యాత్ర 3,200 కి.మి. పూర్తి అయిన సందర్భంగా 293 రోజులు పూర్తి చేసుకుందని తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసిన అనంతరం మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవంబర్ 6వ తేదీ నుండి ఇడుపులపాయ నుండి ప్రజా సంకల్ప యాత్రను ప్రారంభించి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టారని గుర్తు చేశారు. ఈ యాత్రలో తెలుగుదేశం పాలనలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, భూకబ్జాలపైన, దళిత మహిళలపై జరుగుతున్న అకృత్యాలను గురించి ప్రజలకు వివరించి చెబుతూ వస్తున్నారని వివరించారు. రాబోయే ఎన్నికల్లో 2019లో జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తే దళిత, బడుగు, బలహీన వర్గాల వారికి తగు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ సభకు అధ్యక్షునిగా ములకపల్లి వెంకటేష్, కాకినాడ పెంటారావు, ఎం. రాములు, పెద్దాడ కనకరాజు, ములగపల్లి గోవింద్, కనకరాజు, వెంకట బాలాజీ, ముప్పిడి కృష్ణ, పలివెల కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

## బీరు బాటిళ్లతో యువకునిపై దాడి



రావికమతంః తమ సోదరిని ప్రేమిస్తున్నాడనే ఉద్దేశ్యంతో ఇద్దరు యువకులు ఒక యువకుడిపై దాడి చేసిన సంఘటనలో ఆ యువకుడు తీవ్రంగా గాయాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళితే రావికమతం గ్రామానికి చెందిన వేపాడ నరేంద్రకుమార్(17) కొత్తకోట లారీ డ్రైవర్గా పని చేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన కోన ఈశ్వరరావు కుమార్తెతో ప్రేమలో పడ్డాడు. సుమారు ఏడాది క్రితం వీరిద్దరు గ్రామం వదిలి వెళ్లారు. అయితే వీరి వివాహంకు పెద్దలు అంగీకరించడంతో ఈ ప్రేమ జంట ఇంటికి చేరింది. అయితే వీరు ఇరువురు మైనర్లు కావటంతో రెండేళ్లు ఆగాలని పెద్దలు సముదాయించారు. అయితే నరేంద్ర కుమార్ తరచూ ఆ యువతి కలుస్తుండటంతో బాలిక అన్నయ్య మురళీ, రాజ్కుమార్లు మంగళవారం రాత్రి అమ్మ రెస్టారెంట్ వద్ద ఉన్న నరేంద్రకుమార్పై బీరు బాటిళ్లతో దాడి చేశారు. బాటిళ్లతో పొట్టపైన చేతులు, కాళ్లపై పొడిచారు. అడ్డు తగిలిన వారిపై కూడా దాడికి యత్నించారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు రాకతో మురళీ పరారీ కాగా రాజ్కుమార్ని అదుపులో తీసుకున్నారు. గాయపడ్డ నరేంద్రకుమార్ని 108 ద్వారా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏఎస్సై నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 41 వార్డులో రావాలి జగన్-కావాలి జగన్

విశాఖపట్నంః ఇంటింటికీ నవరత్నాలు హామీలు ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం 41వ వార్డు నలందానగర్, గజపతినగం ఏరియాలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పర్యటించి నవరత్నాలు పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు వైకాపా అధ్యక్షుడు చల్లా ఈశ్వరరావు, రేయి వెంకటరమణ (జిల్లా పార్లమెంట్ ఎస్.సి.సెల్ ప్రెసిడెంట్), షేఖ్ బాబ్జీ (జిల్లా పార్లమెంట్ కార్యదర్శి), తుల్లి చంద్రశేఖర్ (స్టేట్ అధికార ప్రతినిధి), రాయుడు శ్రీను (స్టేట్ బి.సి సెల్ కార్యదర్శి), ఆళ్ళ శివ గణేష్ (స్టేట్ యువజన విభాగ కార్యదర్శి), నంబాల ఈశ్వర రావు (ఉత్తర నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్), పైడి శ్రీను (సిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ) అయినింటి రవికుమార్ (జిల్లా పార్లమెంట్ కార్యదర్శి) గ్రామ నాయకులు లోకనాధ్, తులసీరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిహెచ్సికి కొత్త మంచాలు

యలమంచిలి రూరల్ : యలమంచిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సిహెచ్సి)కి కొత్త మంచాలు వచ్చాయి. దీంతో రోగులకు బెడ్స్ సమస్య తీరనుంది. ఈ ఆసుపత్రికి పదిహేను మంచాలను ప్రభుత్వం మంజూరు చేసింది. కొత్త మంచాలు రావడంతో ఆసుపత్రిలో రోగులకు మంచాల సమస్య తీరిందని ఆసుపత్రి ఇన్చార్జ్ డాక్టర్ శ్రీహరి అన్నారు.

## కొవ్వూరు పాఠశాలకు తీరనున్న వసతి సమస్య

రోలుగుంట : కొవ్వూరు జెడ్పీ ఉన్నత పాఠశాల భవనం నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఎనిమిదేళ్లుగా చాలీచాలని ఆరు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి 13 గదులు అవసరం ఉన్నా ఆరు గదులతోనే కాలం నెట్టుకొస్తున్నారు. ఈ మేరకు నాలుగేళ్ల క్రితం ఇక్కడ హెచ్ఎంగా పని చేసిన పిఎస్ఎన్.మూర్తి అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులకు ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు ఆరు అదనపు గదులు నిర్మాణానికి ఆర్ఎంఎస్ నిధుల నుంచి రూ.34.98లక్షలు మంజూరయ్యాయి. వీటితో నిర్మాణ పనులు సాగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి కల్లా నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని ఎంఇఒ తెలిపారు.

# అజోల్లా ఉపయోగంతో అధిక లాభాలు



గొలుగొండః అజోల్లా ఉపయోగించడం వలన అధిక లాభాలు పొందవచ్చునని బిఎఐ ఫౌండేషన్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి సౌజన్య అన్నారు. బుధవారం లింగంపేటకు చెందిన పరవాడ కవిళేశ్వరరావు వ్యవసాయ భూమిలో బిఎఐ ఫౌండేషన్ ద్వారా అజోల్లా విత్తనాలను వేయడం జరిగింది. అజోల్లా పెంచడానికి వీలుగా నీరు నిల్వ ఉండేటట్లుగా ప్రత్యేక ఏర్పాటు చేసి విత్తనాలు చల్లడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాల దిగుబడి పెరగడానికి అజోల్లా చాలా బాగా ఉపయోగపడుతుందన్నారు.

పాడి పశువులకు అజోల్లాను తినడం వల్ల పాల దిగుబడితో పాటుగా వెన్న శాతం పెరిగి రైతుకు ఆదాయం పెరుగుతుందన్నారు. ఇప్పటి వరకు గొలుగొండ, నాతవరం, మాడుగుల మండలంలో 15 యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. అజోల్లా పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులును తమను సంప్రదిస్తే ఫౌండేషన్ ద్వారా ప్రోత్సాహిస్తామన్నారు.

## శాస్త్రీయ పద్ధతిలో వేతన సవరణ చేయాలి

- కనీస వేతనాల షెడ్యూల్ సవరించాలి
- సిఐటియు జిల్లా కమిటీ వినతి



విశాఖపట్నంః 12 సంవత్సరాల తరువాత కనీస వేతనాలను సవరిస్తున్నామంటూ ప్రభుత్వం ఇచ్చిన ప్రాథమిక జిఓలు కార్మికులకు తీవ్ర నిరాశను కలుగజేశాయని, ఆ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకుని శాస్త్రీయ పద్ధతిలో వేతన సవరణ చేయాలని వేతనాల సలహా బోర్డు చైర్మన్కు సిఐటియు జిల్లా కమిటీ వినతిపత్రం సమర్పించింది. వేతన సవరణ ప్రతిపాదన చేసినపుడు బోర్డు కనీస వేతన సలహా మండలిని సంప్రదించాలని సూచించారు. కొందరు అధికారులు యాజమాన్యాలతో కుమ్మక్కై, కార్మికులకు నష్టం చేసే విధంగా ప్రతిపాదనలు పంపించారని విమర్శించారు. వేతన సంఘం సిఫార్సుల ప్రకారం రూ. 18 వేలుగా నిర్ణయించాలని, వీడీఏను కూడా ప్రతీ పాయింటుకూ పెంచుతూ జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి కె. ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శులు ఆర్. రాము, డి. శ్రీనివాసరావు, జిల్లా నాయకులు వివి శ్రీనివాసరావు, ఎస్. బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు,

## వైసీపీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరిక

- అస్తవ్యస్తంగా 'దేశం' పాలన
- జగనన్నకు ఓటుతోనే దేశాభివృద్ధి



నర్సీపట్నంః నాతవరం మండలం మన్యపురట్ల పంచాయతీ కొత్త రామచంద్రపురం గ్రామంలో వైసిపి పార్టీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీ నాయకులు గుడివాడ వరహాలబాబు ఆధ్వర్యంలో బుధవారం చేరారు.

వీరిని అయ్యన్న యువసేన అధ్యక్షులు చింతకాయల విజయ్ టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం జరిగిందన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు రానున్న ఎన్నికల్లో పార్టీ భారీ మెజార్టీ వచ్చేలా అందరూ కష్టపడాలన్నారు.

ఈ కార్యక్రమంలో నాతవరం ఎంపిపి శింగంపల్లి సన్యాసిదేముడు, జెడ్పీటీసీ కరక సత్యనారాయణ, నాతవరం మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, తాండవ జలాశయ చైర్మన్ పారుపల్లి కొండబాబు, నాతవరం మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చురుగ్గా ఓటరు నమోదు కార్యక్రమం



విశాఖ సిటీః విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఓటరు నమోదు కార్యక్రమం 34వ వార్డు ఎన్హెచ్-5 తాటిచెట్లపాలెం పెద్ద ఆంజనేయస్వామి గుడి దగ్గర 58, 59, 60, 61, బూత్లకు సంబంధించి ఓటరు నమోదు కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె.కె.రాజు 34వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, హరిపట్నాయక్, సన్ని బాబు, యస్.రామారావు, లాళం అప్పారావు, ఆదిలక్ష్మి, పి.గణపతి, ఎ.నాని బాబు, ఎస్.గోపాలరావు, ఏమ్.రామారావు, కె.లక్ష్మణ్ రావు, ఎ.అప్పలరాజు పాల్గొన్నారు.

***11వ వార్డులో..***

బి.ఎస్. లేఅవుట్, ఈస్ట్ గేటు, వద్ద ఓటరు నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె.కె.రాజు 11వ వార్డు అధ్యక్షుడు బి.వై. రావు, మంజుల, సన్యాసిరావు, లజపతి తదితరులు ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భావితరాల భవిష్యత్తును నిర్ణయించేది ఓటర్లే

- అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవలెను
- 21వ వార్డులో ఓటరు నమోదు కార్యక్రమం



విశాఖ సిటీ : భావి తరాల భవిష్యత్తు, ఈ దేశ దశానిర్దేశం చేసేది ఓటర్లేనని విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తి పేర్కొన్నారు. 21వ వార్డులోని శాలిపేటలో ఆ వార్డు అధ్యక్షుడు మాణిక్యాలరావు ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా దక్షిణ నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త డా. పీవీఆర్ ముఖ్య అతిధిగా హాజరై ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డా. పీవీఆర్ మాట్లాడుతూ ఓటు అనేది దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ఓటు ప్రతీ భారతీయుని ముఖ్య హక్కు అని అన్నారు. ఓటు వేయడంతో దేశాన్ని పాలించే మంచి నేతలను ఎన్నుకోవచ్చునని తద్వారా దేశ, రాష్ట్ర, ప్రాంతాల ఉజ్వల భవిష్యత్తును నిర్ణయించే అవకాశం ఉంటుందని అన్నారు. 18 సంవత్సరములు నిండిన ప్రతీ యువతీ యువకులు ఈ హక్కుని వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కును సక్రమంగా వినియోగించకపోవడం వలన రాజకీయ నాయకులు విజ్ఞత లేకుండా చట్టసభల్లో పాల్గొని పాలనను భ్రష్టుపట్టిస్తున్నారని అన్నారు. కావున మన దేశం బాగుండాలంటే ప్రతీ యువత తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకుని మంచి రాజకీయ నాయకులను రాజ్యానికి అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ఆనంద్, కనకరాజు, ఎస్. కుమారి, లీలా, దిలీప్, నభి, గౌస్ మరియు అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# సమాజాభివృద్ధిలో మీడియా పాత్ర ప్రశంసనీయం

**అట్టహాసంగా ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల స్పోర్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం**

**ఆశీస్సులు అందజేసిన అహోబిలం 46 పీఠాధిపతి యతీంద్ర మహాదేశికన్**



విశాఖపట్నం : రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల స్పోర్ట్స్ అసోషియేషన్ నూతన కార్యవర్గం మంగళవారం కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డ మండలం పవిత్ర పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కమిటికి అహోబిలం 46 పీఠాధిపతి యతీంద్ర మహాదేశికన్ ఆశీస్సులు అందజేసి మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మీడియా పాత్ర ప్రశంసనీయమని కొనియాడారు. నూతన కమిటీకి ఆశీస్సులు అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి నూతన కమిటీ పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షులు ఎస్. దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కె. విజయ్కుమార్లు మాట్లాడుతూ జర్నలిస్టుల మధ్య క్రీడా స్ఫూర్తిని నింపాలన్నదే తమ అభిమతమన్నారు. నిరంతరం విధి నిర్వహణలో సమాజానికి సేవలందించే జర్నలిస్టులకు క్రీడలు కూడా అత్యంత అవసరమన్నారు. అందరి సహకారంతోనే త్వరలోనే జాతీయ క్రీడలు నిర్వహించడానికి తమ వంతు కృషిచేస్తామన్నారు. సభ్యులందరూ సమన్వయంతో ముందుకు సాగి క్రీడలు విజయవంతం చేయాల్సిన అవసరం వుందన్నారు.

## జాబ్మేళాకు విశేష స్పందన

నాతవరంః డిఆర్డిఎ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం జాబ్మేళా నిర్వహించారు. చిత్తూరు జిల్లాకు చెందిన అమరన్ గ్రూపు ఆఫ్ కంపెనీ అమర్రాజా గ్రోత్ కార్సడెర్ కంపెనీ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ చేసిన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూల్లో సెలక్టు అయిన వారిని 18 నెలలు శిక్షణతో పాటు రూ.9వేలు వేతనం అందజేస్తారు. అదే విధంగా ఉచిత వసతి, భోజనం కల్పిస్తారన్నారు. శిక్షణా తరగతుల అనంతరం నెలకు రూ.13వేల వేతనం ఇచ్చి పర్మినెంట్ జరుగుతుంది. మహిళలకు నెల్లూరు జిల్లా తడా శ్రీసిటీ మొబైల్ కంపెనీలో పని చేయుటకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 8, 9, 10 తరగతులతో పాటు ఇంటర్వ్యూలు, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్, 18 నుండి 30 సంవత్సరాల వయస్సుల గల మహిళలకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. సెలక్టు అయిన వారికి శిక్షణలో రూ.9వేలుతో పాటు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నారు. అనంతరం శిక్షణ పూర్తయిన తర్వాత రూ.10,300ల వేతనం అందజేస్తారని చెప్పారు. సెలక్ట్ అయిన వారిని కంపెనీకి గురువారం తీసుకువెళతారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం పట్నాల మంగ, డిఆర్డిఎ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏలేరులో పడి వ్యక్తి మృతి

మాకవరపాలెంః ప్రమాదవశాత్తు ఏలేరు కాలువలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం యలమంచిలి నుండి నర్సీపట్నం వ్యక్తి మీద వెళ్లి నర్సీపట్నం నుండి తిరిగి వస్తుండగా కొండలఅగ్రహారం సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న ఏలేరు కాలువ వద్దకు వెళ్లి కాళ్లు, చేతులు కడుక్కొంటుండగా అకస్మాత్తుగా జారిపడటంతో నీటిలో మునిగిపోయాడు. దీంతో ఏలేరు కాలువ ప్రవాహంలో మునిగిపోగా స్థానికులు ఎవరు గుర్తించకపోవడంతో కొంత మేర కొట్టుకుపోయాడు. అయితే పోలీసులకు సమాచారం అందించడంతో స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం కావడంతో మృతదేహం కనిపించకపోవడంతో బుధవారం ఉదయం మరలా వెతకడం ప్రారంభించారు. దీంతో లచ్చన్నపాలెం సమీపంలో మృతదేహం లభ్యమైంది. మృతుడు యలమంచిలి గ్రామానికి చెందిన యల్లపు మల్లిఖార్జునరావు(48)గా గుర్తించారు. మాకవరపాలెం పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కేజిబివి ఎస్ఒగా చంద్రకళ

కొయ్యూరు : కొయ్యూరు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం ప్రత్యేకాధికారి(ఎస్ఒ)గా చంద్రకళను నియమించారు. హుకుంపేట పాఠశాలలో పిడిగా పని చేస్తున్న ఆమెను ఎస్ఒగా నియమించారు. ఇంత వరకు ఇక్కడ ఎస్ఒగా పాఠశాలకు చెందిన శ్రీలక్ష్మి విధులు నిర్వహించారు.


**రక్షణ మంత్రిత్వ శాఖ**

**నేవల్ డాక్యార్డ్, విశాఖపట్నం**

**(టెలిఫోన్ నెం. 0891 2816350, ఫ్యాక్స్: 0891 2816688)**

**టెండరు నోటీసు**

**కోటింగ్ నెం: ఆర్పివైపి/పిఐ/18-19/086**

1. ఎన్డి(వి) వద్ద వెకార్స్ విభాగము కొరకు ఇఎస్డి పని వ్యవస్థలు కల్పనకై ఇ-ప్రొక్యూర్మెంటు ద్వారా సీలు చేసిన డిజిటల్ టెండర్లు కోరుచున్నారు.

2. టెండరు డాక్యుమెంట్లను మేనేజర్ వారి కార్యాలయం కాంట్రాక్టుల నిర్వాహణ, నేవల్ డాక్యార్డు, విశాఖపట్నం వారి నుండి పొందవచ్చును. లేదా వెబ్సైట్ **www.defproc.gov.in** నుండి డౌన్లోడ్ చేసుకుని కూడా పొందవచ్చును. డౌన్లోడ్ చేసుకున్న టెండరు డాక్యుమెంట్లతో పాటు రూ. 1,73,200/- ఏదైనా జాతీయ బ్యాంకు నుండి జారీ చేయబడిన డిమాండ్ డ్రాఫ్టను జతపర్చాలి.

3. అన్ని విధాలుగా పూర్తి చేసిన సీలు వేయబడిన టెండర్లను విశాఖపట్నం నేవల్ డాక్యార్డు యొక్క విజయనగర్ గేటులో అమర్చిన "ఎంవైపి" గా మార్కు చేయబడిన టెండరు బాక్సులో వేయాలి. లేదా డిస్ట్రిబ్యూటర్ ద్వారా పంపించదలచిన వారు కార్యాలయానికి 10 నవంబరు, 2018(ఉ. 1830 గం.లు)లోపు చేరేటట్లు పంపించాలి.

**davp 10702/11/0117/1819** ఎజిఎమ్(ఆర్పి)

# విజయభాను

## సంపాదకీయం

### చర్చనీయాంశంగా 'మీ టూ'

మీ టూ ఉద్యమం సినిమా, మీడియా రంగాలను కుదిపేసింది. ఇప్పుడు రాజకీయరంగాన్ని కూడా తాకటంతో సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది. ఇప్పటికే ఆయా రంగాల్లో ఎంతో లబ్ధ ప్రతిష్టులైనవారు ఈ లైంగిక వేధింపుల ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ సమయంలో తాజాగా కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్‌పై కూడా లైంగిక వేధింపుల ఆరోపణలు రావటం దిగ్భ్రాంతికర విషయం. సామాజిక మాధ్యమాల వేదికగా వెలుగుచూస్తున్న ఘటనలను చూస్తే, లైంగిక వేధింపులకు వేదికకాని రంగం, వ్యవస్థ అంటూ లేదేమో అనిపిస్తున్నది. తనుశ్రీ దత్తా మొదలు కంగనా రనౌత్, గాయని చిన్మయి, గుత్తా జ్వాలా దాకా రోజుకొకరుగా తాము ఎదుర్కొన్న చేదనుభవాలను చెబుతున్నారు. ఆ ఘటనలు వారిని ఎంత తీవ్రంగా మానసికంగా, శారీరకంగా కుంగదీశాయో వాపోతున్నారు. సమాజంలో పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్న వారు ఎంతటి గో-ముఖ వ్యాఘ్రాలో చూపెడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వ్యక్తులుగా, బాధితులుగా ఆయారంగాల్లో వారి ప్రగతి ముగిసిపోయింది. అంతేకాదు జీవితమే ముగిసినంతంగా అన్నివిధాలా నష్టపోయిన వారూ ఉన్న ఉదంతాలున్నాయి. ఇలాంటి అమానవీయ ఘటనలు అభివృద్ధిచెందిన నాగరిక సమాజానికి ప్రతీకలుగా, వేదికలు గా చెప్పుకుంటున్న వ్యవస్థల్లోనూ ఉండటమే నేటి విషాదం. మీ టూ ఉద్యమం మన దేశంలో ఏడాది కిందట మొదలై బాలీవుడ్ నుంచి తెలుగు చిత్రసీమకు చేరుకోవటమే కాదు మీడియా రంగానికి కూడా విస్తరించి మొత్తంగా సమాజాన్ని కుదిపేస్తున్నది. నిజానికి అమెరికాలో 2006లో జరిగిన ఓ ఘటన మీ టూ ఉద్యమానికి ఊపిరిపోసింది. న్యూయార్క్‌కు చెందిన తరానా బర్క్ గాళ్స్ ఫర్ జెండర్ ఈక్విటీ సంస్థలో ప్రోగ్రాం డైరెక్టర్‌గా పనిచేసేది. అమ్మాయిల సమానహక్కులు, సంక్షేమం కోసం పనిచేసే ఆమెపైనే రెం డుసార్లు లైంగికదాడి జరిగింది. పరాయి వ్యక్తి చేయి తాకితేనే అసౌకర్యం, కంపరమెత్తే పరిస్థితి ఉంటే, ఏకంగా తన నిస్సహాయతను ఆసరాగా చేసుకొని లైంగిక దాడిచేస్తే ఎంతటి నరకం అనుభవించి ఉంటుందో ఊహించుకోవాల్సిం దే. ధైర్యాన్నంతా కూడదీసుకొని తనకు ఎదురై న భయంకర పరిస్థితులను, బాధను అంతర్జాలంలో పెట్టింది. దీన్ని సామాజిక మాధ్యమాల్లో చూసిన వేలాదిమంది బర్క్‌కు బాసటగా నిలువటమే కాదు, తాము కూడా జీవితంలో ఎదుర్కొన్న చేదనుభవాలను ప్రపంచానికి చాటుతూ మీటూ ఉద్యమాన్ని విస్తృతం చేశారు. ఇప్పుడు పదులు, వందల సంఖ్యలో మహిళలు తాము ఎదుర్కొన్న దాడుల గురించి ధైర్యంగా చెబుతున్నారు. ఈ క్రమంలోనే హాలీవుడ్ నిర్మాత హార్వే వీన్‌స్టెన్ నుంచి తమకు ఎదురైన లైంగిక వేధింపుల గురించి గైనెత్ పాల్ట్రో, ఎంజెలినా జోలీ ప్రపంచానికి చాటి చెప్పటంతో ప్రపంచమం తా విస్తుపోయింది. అంతేకాదు హార్వే బాధితులుగా 12 మంది మహిళలు ముందుకొచ్చి తమ గోడును తెలుపటంతో మహిళలపై జరుగుతున్న దాడుల తీవ్రత ప్రపంచానికి తెలిసివచ్చింది. ఈ ప్రకంపనలు సద్దుమనగక ముందే హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ టొబాక్ తమను లైంగికంగా వేధించాడంటూ 38 మంది మహిళలు ముందుకురావటంతో మీటూ ఉద్యమం ఇప్పుడు మహిళల ఆత్మగౌరవ ఉద్యమంగా మారింది. హాలీవుడ్, బాలీవుడ్ మీదుగా దక్షిణాదికి, తెలుగు చిత్రసీమకు విస్తరించిన మీటూ ఉద్యమం అనేకమంది ప్రముఖ వ్యక్తుల అసలు ముఖాలను ముసుగుతీసి చూపుతున్నది. ఆ మధ్యనే కాస్టింగ్ కౌచ్ అనేది తెలుగు చిత్రరంగాన్ని ఏ తీరుగా పట్టిపీడించిందో తెలిసిందే. ఓ టీవీ ఛానల్ మహిళా రిపోర్టర్ సినీరంగంలో అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న వర్ధమాన నటిగా 2005లో చేసిన స్టింగ్ ఆపరేషన్ బాలీవుడ్ బండారాన్ని బయటపెట్టింది. ఈ స్టింగ్‌లో ప్రముఖ నటుడు శక్తికపూర్, అమన్‌వర్మ అడ్డంగా దొరికిపోయారు. సినిమాలో వేషాలు కావాలంటే తమ కోరిక తీర్చాలని షరతు పెట్టారు. ఇలా లైంగిక వేధింపులకు పాల్పడిన అహూజాకు న్యాయస్థానం ఏడేండ్ల కారాగార శిక్ష విధించింది. అలాగే పీప్లీ లైవ్‌సినిమా సహ దర్శకుడు మహమూద్ ఫారూఖీకి ఏడేండ్ల శిక్ష పడింది. ఈ జనవరిలో చెన్నై ఎక్స్‌ప్రెస్ సినీ నిర్మాత మొరానీపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. తాజాగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీరంగ ప్రముఖుల్లో బాలీవుడ్ నటుడు నానా పటేకర్, హిందీ రచయిత, నిర్మాత అలోక్‌నాథ్, జాతీయ పురస్కార గ్రహీత తమిళ గీత రచయిత వైరముత్తు, తమిళ నటుడు రాధారవి, మలయాళ నటుడు ముఖేష్ తదితరులు ఉండటం గమనార్హం. ఎప్పుడో దశాబ్దాల కిందటి విషయాలను ఇప్పుడు తెరమీదికి తేవటంలోని ఔచిత్యాన్ని ప్రశ్నిస్తున్నవారు, అసలు లైంగిక వేధింపుల ఉనికిని నిరాకరిస్తున్న దాఖలాలు లేవు.

# అన్ని సేవలకన్నా నారాయణసేవే మిన్న

**- యువత భక్తిభావంతో మెలగాలి - చెడును అంతమొందించేందుకే దుర్గాదేవి అవతారం**

**- పలు అన్నసమారాధన కార్యక్రమాలలో పాల్గొన్న డా. పీవీ రమణ మూర్తి**



విశాఖ సిటీ : అన్ని సేవలకన్నా నారాయణసేవే మిన్నయని, దుర్గాదేవి భక్తులకు ఆ తల్లి ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని దక్షిణ నియోజకవర్గ వైఎస్‌ఆర్ సీపీ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తి తెలియజేశారు. నియోజకవర్గంలోని పలు వార్డులలో అన్న సమారాధన కార్యక్రమాలలో పాల్గొన్న డా. పీవీఆర్ మాట్లాడుతూ యువత భక్తి మార్గంలో నడిచి పదిమందికీ సహాయపడే మంచి కార్యక్రమాలు చేస్తూ పలువురి మన్ననలు పొందాలని పిలుపునిచ్చారు. చెడును అంతమొందించేందుకే దుర్గాదేవి అవతరించిందని, ప్రతీ మనిషిలోని చెడు స్వభావం తొలగి తోటిమనిషికి సహాయం అందించడమే ప్రధాన ధ్యేయంగా ఉంచుకుని, మానవ సేవే మాధవ సేవగా తలంచి పదిమందికి సహాయ సహకారాలందించాలని, అప్పుడే దుర్గామాత కరుణా కటాక్షాలు అందరికీ ఉంటాయని డా. పీవీఆర్ పేర్కొన్నారు.

**31వ వార్డులో ..**

గ్రేటర్ విశాఖ 31వ వార్డు రైల్వే న్యూకాలనీలో వైజాగ్ లైటింగ్ సౌండ్స్, డెకొరేషన్స్ - ఓనర్స్ అండ్ వర్కర్స్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు వైఎస్‌ఆర్ సీపీ అధ్యక్షుడు షేక్ జుబే ఆహ్వానం మేరకు దక్షిణ నియోజకవర్గ వైఎస్‌ఆర్ సీపీ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తి హాజరై దుర్గమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ ఐహెచ్ ఫరూకీ, కాశీప్రసాద్, దుంపా గురూజీ రెడ్డి, బ్రహ్మజీ, పాండురంగేశ్వర్, శేఖర్, లోకేష్, నాగమణి, మంజుల, శ్రీవేణి, వర, రమణమ్మ మరియు అధిక సంఖ్యలో వైఎస్‌ఆర్ సీపీ అభిమానులు, కార్యకర్తలు, అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

**26వ వార్డులో ..**

గ్రేటర్ విశాఖ 26వ వార్డు కల్లుపాకలు, అంగన్‌వాడీ కేంద్రం వద్ద శ్రీ కాణిపాక యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో దుర్గానవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వార్డులోని బుధవారం నారాయణ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు అలుపనక కనకా రెడ్డి ఆహ్వానం మేరకు అమ్మవారి ప్రత్యేక పూజలలో పాల్గొన్న దక్షిణ నియోజకవర్గ వైఎస్‌ఆర్ సీపీ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తి పాల్గొని అనంతరం నారాయణ సేవ కార్యక్రమంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర యువజన విభాగం అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ, మహిళా అధ్యక్షురాలు రామ, మజ్జి చెల్లారావు, టి. కోటేశ్వరరావు, జి. శివ, యాసిన్ బాబా, బుజ్జి, ఆదివిష్ణు, టి. అశోక్, దుర్గాప్రసాద్, చిన్న మూర్తి, సిహెచ్. శ్రీను, సిహెచ్. మల్లిఖార్జున్, నాగిరెడ్డి, కె. అప్పలరాజు మరియు అధిక సంఖ్యలో యువకులు, మహిళలు పాల్గొన్నారు.



# యువతకు దేశ రక్షణ దళాలలో ఉజ్వల భవిష్యత్తు

## గీతం ఎన్‌సిసి శిక్షణా శిభిరంలో కల్నల్ అమిత్ శర్మ




సాగర్‌నగర్ : దేశానికి సేవ చేసే అవకాశంతో పాటు సాహసోపేతమైన జీవితాన్ని గడపడానికి, ఉజ్వల భవిష్యత్తుకు యువత దేశ రక్షణాదళాలలోకి ప్రవేశించాలని కల్నల్ అమిత్ శర్మ ఎన్.సి.సి కేడెట్లకు పిలుపునిచ్చారు.గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్ సి సి కేడెట్ల శిక్షణా శిభిరంలో బుధవారం ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్.సి.సి కేడెట్‌లకు మిలటరీ శిక్షణతో పాటు సామాజిక అవాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ఈ తరహా శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడగలవన్నారు. కంబెన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ గా గీతంలో ఏర్పాటయిన శిక్షణా శిభిరానికి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, జిల్లాల నుంచి 476 మంది ఎన్.సి.సి కేడెట్‌లు హజరైనట్లు కల్నల్ ఎస్.కె.పట్నాయిక్ తెలిపారు.రక్షణ ధళాలలో గల ఉద్యోగ అవకాశాలను ఎన్.సి.సి కేడెట్‌లకు ఆయన వివరించారు.అలాగే ఎన్.సి.సి లో ఎ,బి,సి సర్టిఫికేట్ పరీక్షలకు ఎలా సన్నధం అవ్వాలి అనేది తెలియజేశారు. ఈ శిక్షణా శిభిరంలో భాగంగా ఎన్.సి.సి కెడెట్‌లకు మ్యాప్ రీడింగ్,చిన్న ఆయుధాలను పేల్చడం, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్‌క్రాఫ్ట్, వెపన్ డ్రిల్ అంశాల పై తర్ఫీదునిచ్చారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 65 మంది ఎన్.సి.సి కేడెట్లను ఈ శిభిరం ద్వారా గుర్తించినట్లు కల్నల్ ఎస్.కె పట్నాయిక్ తెలిపారు.ఎంపికయిన కేడెట్‌లు సికింద్రాబాద్‌లో జరిగే ప్రి రిపబ్లిక్‌డే శిక్షణా శిభిరంకు హజరవుతారని తెలిపారు.

వత్తిడులను తట్టుకునిలవడం, వ్యక్తిత్వవికాసం, స్వచ్ఛభారత్, ఆరోగ్యభద్రత తదితర అంశాలపై సీనియార్ ఎన్.సి.సి అధికారులు తరగతులు భోధించారు. వివిధ రకాల పోటీలలో విజేతలకు బహుమతులను అంద జేశారు.

## కవి సమయం

### 'శక్తే దైవం'

యమక లేళ లెగిసి - శ్రమయే దైవం అనిపించు
శ్రమతో అడుగులు - వేయుట మన వంతు
సోమరి నడకలు నడవద్దు
సోకులు ఖర్చులు తగ్గించు.
పొదుపుకు శ్రద్ధ వహించు
దుబార ఖర్చులు వద్దంటు.
మోపులు మోయుట మన వంతు
నీతిగ బతుకుట జనమంటు.
ప్రగతి పథం - మహతి రథం గావించు
భారత భూమికి - విలువలు తెప్పించు
చదువులు తోను చక్కదిద్దు
వినయం పదిల బరచు
వ్యసనానికి - బలికావద్దు
యువతరానికి - ఇది బలవంతు
మీలో వున్న శక్తే దైవం
మీలో వున్న భక్తే దైవం
భావి తరాలకు భాగ్యాలు కల్పించండి
విద్యావంతులు చేయండి

... కవిత రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512

## పంచాంగం

మాసం : ఆశ్వయుజ; తిథి : బహుళ పాఢ్యమి రా.9.42; అశ్విని ఉ.10.28; ఉ.వ. 8.20ల 5.00; రా.వ. 5.43 | గురువారం 25-10-2018

**మేషం:** స్త్రీలకు తల, మెడ, నడుము, నరాలకు సంబంధించిన చికాకులు ఎదుర్కొనక తప్పదు. వాతావరణంలో మార్పు వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. వృత్తి వ్యాపారులకు శ్రమాధిక్యత మినహా ఆశించినంత పురోభివృద్ధి ఉండదు. **వృషభం** : రాజకీయాల్లో వారి కార్యక్రమాలు వాయిదా పడుట వల్ల ఆందోళనకు గురవుతారు. మీ సరదాలు కోరికలు వాయిదావేసుకోవాల్సివస్తుంది భాగస్వామికుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన కలిగిస్తుంది. **మిధునం** :వ్యాపారాల్లో గణనీయమైన పురోభవృద్ధి సాధిస్తారు. భార్యాభర్తల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తుతాయి. కలప, సిమెంట్, ఇసుక రంగాలలో వారికి లాభదాయకం. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తారు. దీర్ఘకాలిక పెట్టుబడులు, కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. స్త్రీలకు ఆహార, ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. **కర్కాటకం** :స్థిరాస్తి కొనుగోలు వ్యవహారాలకు అనుకూలం. ఖర్చులు బాగా పెరిగే అస్కారం ఉంది. ధన వ్యయంలో ఏకాగ్రత అవసరం. ప్రముఖుల కలయిక సాధ్యము కాదు. ఉద్యోగస్తులు సమర్థవంతంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఇసుక కాంట్రాక్టర్లకు అధికారుల నుంచి ప్రతికూలతలు ఎదుర్కొంటారు. మీ ఔన్నత్యాన్ని ఎదుటివారు గుర్తిస్తారు. **సింహం** : బ్యాంకు పనుల్లోను, వాహనం నడుపుతున్నప్పుడు ఏకాగ్రత వహించండి. ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఒక శుభకార్యాన్ని ఘనంగా నిర్వహిస్తారు. స్త్రీల, ఆరోగ్యం క్రమంగా మెరుగు పడుతుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. ఆత్మీయులను కలుసుకుని మీ బాధలు చెప్పుకోవాలనిపిస్తుంది. **కన్య** :కోర్టు వ్యవహారాలు పరిష్కరించబడుతాయి. రాబడికి మించిన ఖర్చులు, చెల్లింపుల వల్ల స్వల్ప ఆటుపోట్లు తప్పవు. క్రయ విక్రయాలు సంతృప్తికరంగా ఉంటాయి. వృత్తుల వారికి మంచి గుర్తింపు, శ్రమకు తగిన ఆదాయం లభిస్తుంది. స్త్రీలకు తమ మాటే నెగ్గా లన్న పంతం అధికంగా ఉంటుంది. బంధువులతో సత్సంబంధాలు నెలకొంటాయి. **తుల** : ఏజెంట్లు, బ్రోకర్లకు శ్రమాధిక్యత మిశ్రమ ప్రతిఫలంగా ఉంటుంది. మిమ్ములను చిన్నచూపు చూసిన వారే మీ ఔన్నత్యాన్ని గుర్తిస్తారు. తొందరపాటు నిర్ణయాల వల్ల నష్టపోయే అస్కారం ఉంది. నిరుద్యోగుల ఆలోచనలు ఉపాధి పథకాల దిశగా సాగుతాయి. స్త్రీలకు సంపాదన పట్ల ఆసక్తి, చుట్టుపక్కల వారి ప్రోత్సాహం లభిస్తుంది. **వృశ్చికం** : స్త్రీలకు ఏ విషయంలోను మనస్థిమితం అంతగా ఉండదు. కుటుంబీకుల మధ్య అనురాగవాత్సల్యాలు పెంపొందుతాయి. నిరుద్యోగులు భేషజాలకు పోకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఉత్తమం. మీ సంతానం చదువుల కోసం ధనం బాగా వెచ్చిస్తారు. మీరు ఎవరికీ ఎటువంటి హామీలు ఇవ్వడం శ్రేయస్కరం కాదు. **ధనుస్సు** : ఉద్యోగస్తులు తోటివారితో విందులు, శుభ కార్యాల్లో పాల్గొంటారు. ఇతరులపై ఆధారపడటం మంచిది కాదని గమనించండి. మీ సంతానం పై చదువులు, ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ వహిస్తారు. **మకరం** : వృత్తి, ఉద్యోగ విషయాల్లో అందరితో స్నేహంగా ఉండే ప్రయత్నం చేయండి. భవిష్యత్తుకు ఉపయోగపడే నూతన పరిచయాలు బాగా జరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు చేస్తారు. ఫైనా న్సు, బ్యాంకుల నుంచి పెద్ద మొత్తం ధనం డ్రా చేసే విషయంలో జాగ్రత్త వహించండి. కుటుంబ సభ్యుల ఆరోగ్య నిమిత్తం ఖర్చులు పెరుగుతాయి. **కుంభం** : ఉద్యోగస్తులకు కొత్తగా వచ్చిన అధికారులతో సత్సంబంధాలు నెల కొంటాయి. ఖర్చులు ఊహించినవి కావడంతో ఇబ్బందు లంతగా ఉండవు. ఉపాధ్యాయులు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. **మీనం** : బ్యాంకు చెక్కులు ఇచ్చే విషయంలో పునరాలోచన మంచిది. కుటుం బీకుల మధ్య స్వల్ప విషయమే చిలికి చిలికి గాలి వానలా మారుతుంది.

# సాయిబాబా చిన్న కథలు



### భక్తులు కోరవలసిందేమిటి?


హనుమంతుడు శ్రీరామచంద్రుని వార్తను సీతామాతకు తెలిపి, లంకలో తన కార్యమును పూర్తి గావించుకుని తిరిగి శ్రీరామచంద్రుని వద్దకు పోవుటకు ముందు సీతామాత వద్దకు వెళ్లాడు. """తల్లీ! నన్ను ఆశీర్వదించు" అని ప్రార్థించాడు. సీతాదేవి "హనుమంతా! శాంతుడవు. బలవంతుడవు. గుణవంతుడవు. నీవు అజరుడవై వర్థిల్లు" అన్నది. హనుమంతునికి ఆనందం కలగలేదు. అతని యొక్క అసంతృప్తిని గమనించిన సీత "నాయనా! నీవు అమృతుడవై జీవించు" అన్నది. ఇది కూడా అతనికి ఆనందం ఇవ్వలేదు. హనుమంతుని ముఖము చూచి మరల "హనుమ! నీ గుణగణములను ముల్లోక వాసులు కీర్తించెదు గాక" అని దీవించినది. ఆ మాటలు విని హనుమంతుడు సిగ్గుతో తలదించుకున్నపుడు హనుమంతుని మనస్సును అర్థము చేసుకున్న సీతామా, చివరకు "రాముడు నిను నిరంతరము ప్రేమించుగాక!" అని ఆశీర్వదించింది. ఆ మాటలు విన్నంతనే హనుమంతుడు గంతులు వేశాడు. తాను కోరినది అదే. దైవ ప్రేమను కోరాలి. దైవ ప్రేమకు నోచుకోని జీవితము సజీవ సమాధితో సమానమని హనుమంతుడు విశ్వసించాడు.

### కర్మాను బంధీని మనుష్య లోకే..

ఏకైక పుత్రుడు కలిగిన ఒక తల్లి భర్తను కోల్పోయి కుమారుని తీసుకుని పక్క గ్రామానికి ప్రయాణమయింది. మార్గాయాసం వల్ల అలసిపోయి ఆ తల్లీబిడ్డలు చల్లని చెట్టుకింద విశ్రాంతి తీసుకొనుటకు కూర్చున్నారు. ఆమె తన కుమారుని తన తొడపై పరుండబెట్టుకుని తాను కూడా కొంతసేపు నిద్రపోయింది. ఒక కునుకు తీసిందో లేదో కుమారుడు కెవ్వున కేక వేసి ఏడ్వసాగాడు. తల్లి కన్నులు తెరచి చూసింది. ఒక పాము చెట్టు వద్ద ఉన్న పుట్టలోకి దూరిపోవడం చూసింది. ఆ పాము పిల్ల వానిని కరిచి వెళ్లిపోయింది. పిల్లవాని నోటి నుండి రక్తం కారింది. కొంత సేపటికి ప్రాణం పోయింది. కుమారుని మృతదేహాన్ని ఒడిలో పెట్టుకుని ఏకాకిగా రోదిస్తోంది ఆ తల్లి. ఆ సమయంలో ఒక వ్యక్తి ఆ మార్గంలో వెళ్లుతూ ఈమె ఏడ్పును విని దగ్గరకు వచ్చాడు. అతడు ఒక దొంగ. అయినప్పటికీ దుఃఖిస్తున్న ఆ తల్లిని చూచినంతనే అతని హృదయం కరిగింది. "తల్లీ! ఎందుకు ఏడుస్తున్నారు?" అని అడిగాడు. "కుమారుడు మరణిస్తే తల్లికి దుఃఖము సహజము కదా నాయనా!" అన్నది. పిల్లవాని మరణానికి కారణమేమిటని అడిగాడు దొంగ. పుట్టను చూపిస్తూ దానిలోని పాము వచ్చి కాటు వేసింది అన్నది.

...సశేషం

## సంకీర్తన



రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

ఆర్యవైశ్య వివాహ
పరిచయ వేదిక
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్య కులస్థుల వివాహ పరిచయ వేదికలో పాలు పంచుకునే వారు సంప్రదించండి
అక్టోబరు 28, ఆదివారం



రిజిస్ట్రేషనుకు చివరి తేది : 25-10-18
ఉమియా భవన్ కళ్యాణ మండపం
సుబ్రహ్మణ్య స్వామి గుడి ఎదురుగా
ఎన్.ఎ.డి జంక్షన్, విశాఖపట్నం
98491 03826
80741 93882

DMK ITI (p)
TRADES: Electrician & Fitter Scholorship for Eligible Candidates
Note: అతి తక్కువ ఫీజులకు సీటు ఇవ్వబడును
Sabbavaram, Visakhapatnam (Dt.) 531035
Contract: 83090 08289

APOSS (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఓపెన్ స్కూల్)
Direct: SSC & Inter (Any group) One Sitting pass Guarantee, DMK Junior College, Sabbavaram, Visakhapatnam (Dt). 531035
Contact: 9441426955, 7396221464

SREE KUSUMA HARANATH COLLEGE OF EDUCTION (D.ED.,)
2017-19 Batch సీట్లు అతి తక్కువ ఫీజులకు ( 1 సం. కలిసొచ్చును )
2017-19 Batch సీట్లు కూడా అతి తక్కువ ఫీజులకు ఇవ్వబడును.
Sabbavaram, Visakhapatnam (Dt). 531035
Contact: 9441426955, 7396221464

# ప్రజా సమస్యల పరిష్కారంలో అహర్నిశలు శ్రమిస్తున్నాం

## - అర్హులకే సంక్షేమ ఫలాలు - ఎమ్మెల్యే వాసుపల్లి



విశాఖపట్నం: ప్రజా సమస్యల పరిష్కారంలో అహర్నిశలు శ్రమిస్తున్నామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. డయల్ యువర్ ఎమ్మెల్యే, ప్రజాదర్బార్, గ్రామదర్శిని కార్యక్రమాల ద్వారా నిత్యం ప్రజల్లోనే ఉంటూ... ప్రజల సమస్యలు తెలుసుకుని, వెంటనే వాటిని పరిష్కరిస్తున్నట్లు వివరించారు. విశాఖ దక్షిణం, 23వవార్డులోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటిం టికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసు కున్నారు. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధి కారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...

ప్రజలు అడిగిన అన్ని అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని తెలిపారు. నాలుగేళ్లలో దక్షిణంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందన్నారు. అర్హులైన పేదలకే సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా అర్హులను గుర్తించి, వారితో స్వయాన దరఖాస్తు చేయించి వారికి అండగా నిలుస్తున్నామని, దక్షిణ నియోజక వర్గాన్నీ అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కేదారి లక్ష్మీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలు జరిపించాలి

భీమునిపట్నం : ఆగస్ట్ ఒకటి తో పదవీకాలం పూర్తయిన గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిపించకుండా రాజ్యాంగ విరుద్ధంగా కుంటి సాకులు చెప్పడం ప్రభుత్వం బాద్యత రాహిత్యంలా వ్యవహరిస్తోందని. ఆంద్ర చైతన్య పార్టీ భీమిలి ఇన్ చార్జ్ కంటుబుక్త సునీత అన్నారు. హై కోర్ట్ ఆదేశించినట్టు గా వచ్చే మూడు నెలలో పంచాయతీ ఎన్నికలు జరిపించాలని.ఆమె డిమాండ్ చేశారు.



**భారత కీర్తి ప్రతిష్టతలు మరోసారి రెపరెపలాడాయి. తెలుగు తేజం అబ్బుర పరిచే ప్రతిభతో ఇతర దేశంలో సత్తా చాటి దేశానికి వన్నె తెచ్చింది. విశాఖ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో చదువుతున్న శరణ్య ముందుండి గ్రీస్‌లో జరిగిన యునైటెడ్ వరల్డ్ చిల్డన్ ఫెస్టివల్ ఆఫ్ కల్చలర్ అండ్ ఆర్ట్ గ్రీన్స్ 2018 లో లిటిల్ మిస్ యునైటెడ్ వరల్డ్ గా ఎంపికైంది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి గంటా శ్రీనివాసరావు శరణ్యకు అభినందనలు తెలియజేశారు.**

# పేదల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం



అనకాపల్లి : పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో వేల్పులవీధి సీతారామ కళ్యాణ మండపంలో ఆంధ్రాబ్యాంకు ఆద్వర్యంలో జరిగిన రుణ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్దికంగా మహిళలు నిలదొక్కుకోవాలనే ధ్యేయంతో ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలకు రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. 109 పధకాలను ప్రవేశపెట్టి దేశ వ్యాప్తంగా, ఎక్కడాలేని విదంగా, రాష్ట్ర ముఖ్య మంత్రి పనిచేస్తున్నారని, అన్నారు.

ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తూ పార్టీలకు కులాలకు, మతాలకు అతీతంగా పని చేయడం జరుగుతుందన్నారు. అలాగే, ఆంధ్రా బ్యాంకు అధి కారితోపాటు, తెలుగు దేశంపార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, కొణ తాల వెంకటరావు, తదితరులు ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. రుణాలకు చెందిన చెక్కులను పంపిణీ చేశారు.

# అంగన్వాడీలపై వేసిన పర్యవేక్షణ కమిటీ రద్దు చేయాలి

అనంతగిరి : అంగన్వాడీ లపై వేసిన పర్యవేక్షణ కమిటీ రద్దు చేయాలని అంగన్వాడీ సిబ్బంది సిఐటియు నాయకులు డిమాండ్ చేసారు మండలకేంద్రంలో బుదవారం నాడు అంగన్వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని మండలకేంద్రంలో ఐసిడిఎస్ కార్యాలయంవద్ద అంగన్వాడీ నాయకులు సిఐటియు నాయకులు నిరసనకార్యక్రమము చేపట్టారు సీఐటీయూ నాయకులు కళావతి మాట్లాడుతూ హెల్పర్ కు పదేళ్లు సీనియారిటీ ఉంటే ప్రమోషన్స్ ఇవ్వాలని జీఓ జారీ చేసారని అయిన అమలుకు నోచుకోవడం లేదని అన్నారు అంగన్వాడీ లను వేధించే పర్యవేక్షణ కమిటీలను రద్దు చేయాలని అంగన్వాడీ కేంద్రాలను తణిఖీ లు చేసేందుకు సూపర్ వైజర్లు సీడీపీఓ లు ఉన్నారని అభిప్రాయం వ్యక్తం చేసారు అనంతరం ఐసీడీఎస్ అధికారికి వినతిపత్రం అందజేసారు ఈకార్యక్రమంలో అంగన్వాడీ హెల్పర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్కూల్ బస్ ఢీ కొని చిన్నారి మృతి

భీమునిపట్నం : స్కూల్ బస్సు ఢీ కొన్న సంఘటన లో మూడేళ్ళ చిన్నారి మృతి చెందిన సంఘటన భీమిలి నేర్లవలస లో జరిగింది. పోలీసులు కధనం ప్రకారం నిడిగట్టు పంచాయతీ, నేర్లవలస గ్రామానికి చెందిన జీరు అప్పలరాజు,హరికి ఇద్దరు కుమార్తెలు. కాగా పెద్ద కుమార్తె లావణ్య కె.నగరపాలెం లోని సరస్వతీ విద్యాలయం లో యు.కె.జి చదువుతుంది. అయితే లావణ్య ను స్కూల్ కు తీసుకొని వెళ్ళడానికి స్కూల్ బస్సు వచ్చి వాళ్ళ ఇంటి ముందు ఆగింది. బస్సు వచ్చిందనీ అప్పలరాజు కుమార్తె ను బస్సులో ఎక్కించారు. అయితే చిన్న కుమార్తె లహరి (3) ఆడుకుని బస్సు ముందుకు వెళ్ళడం డ్రైవర్ గమనించక ముందుకు బస్సును పోనిచ్చారు. దాంతో బస్సు కింద పడి తీవ్రంగా గాయపడింది. గాయపడిన లహరిని తగరపువలస ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుండి కెజిహెచ్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భీమిలి ఎస్.ఐ శ్రీను బస్సు డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

# చంద్రన్నబీమా పరిహారం పంపిణీ



భీమునిపట్నం : తగరపువలస జోన్ 2వ వార్డుకు చెందిన మామిడి శ్రీకాంత్ మృతి చెందడంతో ఆయన భార్య మామిడి కళ్యాణి కి చంద్రన్నభీమా బాండ్ రూ. 1,95,000 పట్టణ టీడీపీ అధ్యక్షులు కొప్పలరమేష్ అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రన్నభీమా పథకం పేదలకు వరం లాంటిదని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు రవ్వ వెంకట రావు, ఎస్సీ సెల్ కార్యదర్శి నరవ రామారావు, తమ్మిన.సూరిబాబు, టీడీపీ నాయకులు కొప్పల.కృష్ణ, తమ్మిన సూరిబాబు, జన్మభూమి కమిటీ సభ్యులు,భీమామిత్ర పోతిన.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా ప్రతిభా అవార్డు అందుకున్న హరిపాలెం విద్యార్థి



అచ్యుతాపురం: తమ పాఠశాలకు చెందిన విద్యార్థి కె.శివప్రసాద్ ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు చేతుల మీదుగా క్రీడా ప్రతిభా అవార్డు అందుకున్నాడని హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.జగదీశ్వరరావు బుధవారం ఒక ప్రక టనలో తెలియజేశారు.. 2017-18 సంవత్సరంలో తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రతిభా పురస్కారం ప్రవేశపెట్టిందని దీనిలో భాగంగా ఒంగోలులో జరిగిన క్రీడా ప్రతిభా పురస్కారాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కె.శివప్రసాద్ క్రీడా ప్రతిభా అవార్డు అందుకున్నాడన్నారు. క్రీడా ప్రతిభా అవార్డుకుగాను 20వేల రూపాయలు నగదు, ఒక ట్యాబ్, ప్రశంసాపత్రం, గోల్డ్‌మెడల్ అందజేశారు. కె.శివప్రసాద్ అండర్ 17ఖోఖో పోటీలలో జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడుతో పాటు వ్యాయామా ఉపాధ్యాయుడు ధర్మిరెడ్డి రాజు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## సబ్సిడి విడుదలతో పశువులు కొనుగోలుకి అనాసక్తి

### సమన్వయ సమావేశంలో పాలకులు, రైతులు, అధికారులు

నర్సీపట్నం : కార్పొరేషన్ ద్వారా పశువులు కొనుగోలుకి రుణం మంజూరైన లబ్ధిదారులు 2016 నుండి ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ బ్యాంకు అధికారులు, వెటనరీ అధికారులు రుణగ్రహీతలతో ఎంపిపి సుకల రమణమ్మ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

# ఘనంగా మహర్షి వాల్మీకి జయంతోత్సవాలు



విశాఖపట్నం: మహర్షి వాల్మీకి వంటి మహోన్నత వ్యక్తి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమశాఖ నిర్వహించిన జిల్లాస్థాయి మహర్షి వాల్మీకి జయంతి ఉత్స వాలకు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముందుగా మహర్షి చిత్రపటానికి పూలదండ వేసి జ్యోతి ప్రజ్వలన గావించి ఘన నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలో మహర్షి వాల్మీకి జయంతోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం పండగ వాతా వరణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి తన శుభాకాంక్షలను తెలియజేస్తు న్నానన్నారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవా లన్నారు.

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలం భవాని మాట్లాడుతూ మానవ జీవితానికి అనువైన విధంగా రామాయణ మహాకావ్యాన్ని రచించిన మహారుషి అని అభివర్ణించారు. మధురమైన సంస్కృత భాషలో 24వేల శ్లోకాలతో, ఐదువందల సర్గలుగా రూపొందించారన్నారు.

ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలను ప్రదర్శించారు.

జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరెడ్డి, నాగేశ్వరరావు, గీతాదేవి, సిఇఓ రమణమూర్తి, నారాయణ, రామారావు, రమణ, కోయ వాల్మీ, ఆదినారాయణ, పలు వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీసీ సంక్షేమ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# తిత్లీ తుఫాను బాధితులకు భవన నిర్మాణ కార్మికుల చేయూత




గాజువాక: ఇటీవల శ్రీకాకుళంలో భీభత్సం సృష్టించిన తిత్లీ తుఫాను బాధితులకు పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురంనకు చెందిన శ్రీ మహాలక్ష్మీ భవన నిర్మాణ కార్మికుల సంఘం చేయూత నిచ్చింది. బుధవారం బాధితులకు సుమారు 100 బియ్యం బస్తాలను అందజేసే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు అర్దాల రాము మాట్లాడుతూ మన పొరుగు జిల్లా అయిన శ్రీకాకుళం లో ఇటీవలన తిత్లీ తుఫాను కారణంగా అనేక విధాలుగా నష్టం బారిన పడిందని, ఇది దురదృష్టకరమని, వారికి తమ వంతు సహాయం అందించేందుకు తమకు తోచిన సహాయం చేసినట్లు తెలిపారు. తుఫాను బాధితులను అన్నివిధాలుగా ఆదుకోవలసిన బాధ్యత మనందరిపైన ఉందని అన్నారు. మానవతాదృక్పథంతో అందరూ వారికి చేయూత నివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కంబాల సింహాచలం, కోశాధికారి కనకరాజు, సంఘం సభ్యులు గుల్లలరాజు తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నహుండీ లెక్కింపు కోటీ మూడు లక్షల ఆదాయం

సింహాచలం : సింహగిరి పై శ్రీ వరహాలక్ష్మీనరసింహస్వామివారి హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం చేపట్టగా భక్తులు సమర్పించిన నగదు 96 లక్షల 25 వేల రూపాయలు రాగా చిల్లర కాయిన్స్ రూపంలో 6 లక్షల 80 వేలు సమకూరాయి . బంగారం 0.107.500 గ్రాములు. వెండి 9.080. 000గ్రాములు చేకూరింది. 30రోజులుకుగాను ఈ ఆదాయం సమకూరింది ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది మరియు వివిధ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎన్నికకు ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలి



**- ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకొనేందుకు నవంబరు 6 తుది గడువు**
**-2019 జనవరి 1న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ**
**- 2019 జనవరి 1 నుండి 31 వరకూ క్లైమ్స్ మరియు అభ్యంతరాలు స్వీకరణ**
**- 2019 ఫిబ్రవరి 15న క్లైమ్స్ మరియు అభ్యంతరాల పరిష్కారం**
**- 2019 ఫిబ్రవరి 20న తుది ఓటర్ల జాబితా ప్రచురణ**
**- ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు జిల్లా రెవెన్యూ అధికారి సి.చంద్రశేఖర్‌రెడ్డి**

విశాఖపట్నం : ఉత్తరాంధ్రా శాసన మండలి ఉపాధ్యాయ ఎన్నికలకు ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకొనేందుకు నవంబరు 6 తుది గడువు అని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు జిల్లా రెవెన్యూ అధికారి సి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం మరియు విశాఖపట్నం జిల్లాల్లో నివాసం ఉంటున్న ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు అందరూ ఓటర్లుగా తమ పేర్లను నిర్ణీత గడువులోగా నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ ఓటర్లుగా నమోదు చేసుకోవాల్సిన ప్రక్రియను వివరించారు.


2019 జనవరి 1న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురించడం జరుగుతుందని, 2019 జనవరి 1 నుండి 31 వరకూ క్లైమ్స్ మరియు అభ్యంతరాలను స్వీకరిస్తామని, 2019 ఫిబ్రవరి 15కల్లా క్లైమ్స్ మరియు అభ్యంతరాలను పరిష్కరించి, 2019 ఫిబ్రవరి 20న తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఓటర్లుగా పేరు నమోదు చేసుకోదలచిన ఉపాధ్యాయులు తమ దగ్గర్లోని రెవెన్యూ డివిజనల్ అధికారి, తహశీల్దారు, మండల అభివృద్ధి అధికారి, మండల విద్యాశాఖాధికారి, మున్సిపల్ కమిషనర్ తదితర కార్యాలయాల్లో ఫార్ము-19 లో దరఖాస్తు చేసుకోవల్సి వుందన్నారు. ఈ దరఖాస్తుకు అన్ని ధృవీకరణ పత్రాలను జతపర్చాల్సి ఉందన్నారు.

# వైసీపీ అధికారంలోకి వస్తే ముస్లింలకు మరిన్ని సంక్షేమ పథకాలు

## - వచ్చే నెల 3 వ తేదీన జరగనున్న అలా-హజరత్‌ప్రోగ్రాం ను విజయవతం చేయండి

## - వైసీపీ విశాఖ పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు బర్కత్ అలీ



కంచరపాలెం : వైసీపీ అదికారం లోకి వస్తే ముస్లిం లకు మరన్ని సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరుగుతుందని వైసీపీ విశాఖ పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు బర్కత్ అలీ పేర్కొన్నారు. ఈ మేరకు వచ్చే నెల 3 వ తేదీన మర్రిపాలెం వద్ద నిర్వహించనున్న ఆలా-హజరత్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బుదవారం ఉదయం పంజాబ్ హోటల్ కూడలి వద్ద నున్న కార్యలయంలో స్థానిక ముస్లిం సోదరులచే సమావేశం నిర్వహించారు.

(100వ సంవత్సరం సమావేశం )నిర్వహిచడం జరుగు తుందని ఈ సమావేశానికి దేశంలో ఉన్న ప్రఖ్యాత ముస్లిం మత పెద్దలు పాల్గొని తమ సందేశాన్ని వివారిస్తాని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గున్న బర్కత్ అలీ ఈసందర్బంగా మాట్లా డుతూ ముస్లింలు కు ప్రయోజనాలు దక్కలన్న మంచి రోజులు రావాలన్న వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు 2019 ఎన్నికల్లో ముస్లిం అంత జగన్మోహన్ రెడ్డి కి అండగా నిలవాలిని కోరారు.

ఈ కార్య క్రమంలో నజీమ్ అబ్బాస్ టి. బాబా. మున్నీర్. గౌస్. మరియు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

**IN THE HON'BLE JUNIOR CIVIL JUDGE COURT**
**BHEEMUNIPATNAM**
**O.S.NO.140/17**

**Between**
**Canara Bank rep.by its Branch Manager, Pendurti, Visakhapatnam. ...Plaintiff**
**And**
**Sree Prashoon Paper Plates rep.by its Proprietor Smt. Vasantha Viswanadh Sistla ...Defendant.**
**To**
**Sree Prashoon Paper Plates rep.by its Proprietor**
**Smt. Vasantha Viswanadh Sistla**
**W/o.S.V.Viswanadharao, aged 48 years,**
**resident of M.I.G.95, VUDA Colony,**
**Chinamushidiwada, Visakhapatnam.**

**NOTICE**

As per the orders of the hon'ble court, you are hereby informed that the plaintiff has filed above mentioned suit against you and and the case stands posted to **22-11-2018** for your appearance. You are hereby informed to appear in person or through an advocate and file your written statement on **22-11-2018 at 10.30 a.m.** Failing which the suit will be decided in your absence.

**N.Prabhakararao**
**Counsel for Plaintiff**

Visakhapatnam,
Date : 23-10-2018

# రక్షణ కల్పించవలసిన వారే రాక్షసుల అవుతారా?



కొత్తపల్లి: గత 16 సంవత్సరాలుగా ఎస్ సి జెడ్ లో భూమి పోగొట్టుకున్న రైతులు శ్రీరాంపురం పొన్నాడ మూలపేట గ్రామాలకు చెందిన రైతులు సిపిఎం, జనసేన, వైయస్సార్ సి పి, నాయకులు చింత సూర్యనారాయణమూర్తి భూమిని ఎస్సి జడ్ వారు అక్రమంగా భూమిని ఆక్రమించుకున్నారు ఈ నెల 30 వ తేదీ ఆ భూమిలో నాట్లు వేసేందుకు రైతులకు అవగాహన కల్పించే విధంగా బైక్ ర్యాలీ నిర్వహించిన నాయకులను అడ్డగించి అక్రమ అరెస్టులు చేస్తున్నారని ప్రజలకు ఏ ఏ అవసరం వచ్చినా ఏ కష్టమొచ్చినా ప్రజలను కాపాడుతారని పోలీసులను విన్నవిచ్చుకుంటుంటే ఎస్సి జడ్ కొచ్చేసరికి రైతుల కష్టాలను కూడా పట్టించుకోకుండా ఎక్కడ కార్యక్రమం జరిగిన రైతులు కంటే ముందే పోలీసు వారు ఉండటం గమనార్హంగా మారింది న్యాయం కోసం పోరాడితే రక్షించవలసిన వారే వద్ద నుండి రక్షణ కరువవడం పట్ల రైతులు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రజలను కాపాడే పోలీసువారా ఎస్సిజడ్ మనుషుల తెలియడం లేదని వాపోతున్నారు అరెస్టయినవారిలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దువ్వ శేషు బాబ్జి సింహాచలం సుబ్బారెడ్డి చింత సూరారం మూర్తి అఖిలపక్ష పార్టీ నాయకులు జిల్లా రైతు కూలీ సంఘం నాయకులు తిరుమల శెట్టినాగేశ్వరరావు సి ఐ టి యు జిల్లా నాయకులు మేడిశెట్టి వెంకటేశ్వర రావు తదితరులు ఉన్నారు.

# కొత్తపల్లికి చెందిన సూర్య వాటర్ ప్లాంట్ దాతృత్వం

యు కొత్తపల్లి : కొత్తపల్లి గ్రామానికి చెందిన మినరల్ వాటర్ సప్లై చేసే సూర్య వాటర్ ప్లాంట్ యజమాని రేలంగి దొరబాబు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపల్లినకు ప్రతిరోజు పది టిన్నుల వాటర్ బాటిల్స్‌ను సప్లై చేయుటకు ముందుకు వచ్చినారు. ఉదయం పాఠశాల వద్ద అసెంబ్లీలో జరిగిన కార్యక్రమంలో పది టిన్నుల వాటర్ బాటిల్స్‌ను ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.వి రమణ మూర్తికి అందజేసిన రేలంగి దొరబాబు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు మంచినీటికి సతమత మవుతూ పాఠశాల చుట్టుప్రక్కల ప్రతి ఇంటికి వెళ్లి మంచి నీళ్ళు త్రాగడం తనను కదిలించిందని దానికి స్పందించి ప్రతి రోజు మా సూర్య వాటర్ ప్లాంట్ ద్వారా పరిశుభ్రమైన మంచినీటిని మా ప్లాంట్ ద్వారా పాఠశాలకు రోజు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్లాంట్ యజమాని రేలంగి దొరబాబును పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తిక్కాడ తాతా రావు ఉపాధ్యాయులు సిద్ధాంతపు బెన్ జాన్సన్, డీజే రాంబాబు, ఎం ఎన్ ఎస్ ఎస్ ఆర్ కుమార్, వి పి వి సత్యనారాయణ, పి.డి రవి రాజా, చీకట్ల అబ్బులు, టి. యమ్ జె విజయకుమారి, మరియు విద్యార్థులు అభినందించారు.

# అంబేద్కర్ అధ్యయన కేంద్రాలపై సమీక్ష

## హాజరైన అంబేద్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ దేబేంద్ర ప్రసాద్ మజ్జి



విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సౌత్ రీజియన్ అంబేద్కర్ అధ్యయన కేంద్రాలపై సమీక్ష సమావేశం బుధవారం ఉదయం నిర్వహించారు. ఏయూతో సహా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్, అన్నామలై విశ్వవిద్యాలయాల అంబేద్కర్ చెయిర్ సంచాలకులు హాజరయ్యారు. కార్యక్రమానికి అంబేద్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ దేబేంద్ర ప్రసాద్ బజ్జి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్ అంబేద్కర్ చెయిర్స్ (అధ్యయన కేంద్రాలు) పనితీరు, ప్రగతిని ఆయన పరిశీలించారు. నాలుగు విశ్వవిద్యాలయాలలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ అధ్యయన కేంద్రాల పనితీరును ఆయా కేంద్రాల సంచాలకులు వివరించారు. అనంతరం దేబేంద్ర ప్రసాద్ మజ్జి వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వర రావుతో సమావేశమయ్యారు. భవిష్యత్‌లో ఈ కేంద్రాలను మరింత బలోపేతం చేసే విధంగా, కార్యాచరణ విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఏ యూ అంబేద్కర్ అధ్యయన కేంద్రం సంచాల కురాలు ఆచార్య టి.శోభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# అబివృద్ధి పనులకు శంకుస్థాపన ....

కంచరపాలెం : జీవీఎంసీ 37 వ వార్డు పరిది పలు ప్రాంతల్లో 47 .80 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అబివృద్ధి పనులకు సంబందించి ఉత్తరనియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు బుదవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈమేరకు జవహర్ లాల్ నగర్ వద్ద 30 లక్షల వ్యయంతో గెడ్డ, ర్యాంప్ పనులు , ఇంద్రనగర్ -2 లో 8 .90 లక్షల వ్యయంతో డ్రైన్ పనులు , ఇంద్రనగర్ -4 కొండవాలు ప్రాంతం 8.90 లక్షల వ్యయంతో సి.సి.రోడ్, డ్రైన్‌లు, మెట్లమార్గం అధునీకరణ పనులకు సంబందించి శంకుస్థాపన చేసిన ఆయన పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని గుతేదారునికి సూచించారు . కార్యక్రమంలో జీవీఎంసీ ఈ .ఈ నర్సింహరావు, ఎ .ఈ వెంకటలక్ష్మి , బీజేపీ వార్డు అద్యక్షుడు గునుపూడి అరుణ్ కుమార్ , కర్యదర్శులు అనిల్ , రాజేశ్వరి, కోలని అద్యక్షులు గొవింద్ రెడ్డి తదితరులు పాల్గున్నారు

# పేదల సొంతింటి కలను సాకారం చేద్దాం

## ఎమ్మెల్యే వాసుపల్లి



విశాఖపట్నం : పేదల సొంతింటి కలను సాకారాం చేయడంలో మనమంతా శ్రమిద్దామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపునిచ్చారు. పేదలకు సొంతగూడు అందించడం కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం చేపడుతోందని, అర్హులైన పేదలకు వాటిని అందించడంలో మనమంతా కృషి చేద్దామన్నారు. టీడీపీ పార్టీ కార్యాలయంలో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల్లోనే ఉండాలని, ప్రజా సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

నిరుద్యోగ భృతి, ఒంటరి మహిళా పెన్షన్లు, ఇతర అన్ని సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా శ్రమించాలని, యువత ఆరోగ్య రక్షణకు వార్డుల్లో పెద్ద ఎత్తున జిమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

చంద్రన్న పెళ్లికానుకపై ప్రజల్లో అవగాహన కల్పించి వారికి అందేలా కృషి చేయాలన్నారు. పారిశుధ్యం, మురుగు కాల్వలు, రోడ్లు, వీధిదీపాలు, రేషన్‌కార్డులు, తాగునీరు, విద్యుత్ తదితర అన్ని విషయాలను పరిశీలించి, వివరాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన రెహమాన్, విల్లూరి డాక్టర్ చక్రవర్తి, కేదారి లక్ష్మి, హనీఫ్, విన్నకోట, సత్యవతి, జఫ్రుల్లా, దాసన సత్యనారాయణ, తిత్తి సాయి బలరాం, బుచ్చా రామారెడ్డి, ఎఫ్.రెహమాన్, మున్నం బాలాజీ, సూరి అప్పారావు, లక్ష్మీ శివప్రసాద్, మైలపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ప్రీమియర్

## 'ఆల్ న్యూ సాంత్రో' ఆవిష్కరణ




విశాఖపట్నంః లక్ష్మీ హుండాయి షోరూం రామా టాకీస్ వద్ద అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎ. నరసింహమూర్తి, ఆపరేషన్ హెడ్ ఎం. ప్రసాద్ బాబు సరికొత్త 'ది ఆల్ న్యూ సాంత్రో' కారును బుధవారం ఆవిష్కరించారు. ఈ కారు ఆవిష్కరణలో భాగంగా ఏసీపీ నరసింహమూర్తి మాట్లాడుతూ మారుతున్న అవసరాలకు తగ్గట్టు భారతీయుల అభిరుచికి అనుగుణంగా సరికొత్త ది ఆల్ న్యూ సాంత్రో రూపొందించబడిందని ప్రసాద్ బాబు, మేనేజర్ కిషోర్ కుమార్ పేర్కొన్నారు. మోడరన్ స్టైలిష్ టాల్ బాయ్ డిజైన్, స్మార్ట్ ఆటో ఎఎంటి, సుపీరియర్ ఎసీ పెర్ఫార్మెన్స్, విశాలవంతంగా వి లా స వ ం త ం గా రూపొందించబడినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ హెల్త్ కాంట్రాక్టు కార్మికులకు సబ్బులు, చెప్పులు ఇవ్వటానికి అంగీకారం



విశాఖపట్నం: జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్స్ అమలులో భాగంగా ఈరోజు జివిఎంసి ఆఫీస్‌లో జివిఎంసి అధికారులు, అడిషనల్ కమీషనర్ మూర్తి, సిఎంఓ డా॥ హేమంత్, యూనియన్ నాయకులు పి.వెంకటరెడ్డి, జి.సుబ్బారావు, టి.నూకరాజుల సమక్షంలో జిఎంసిలో పనిచేస్తున్న పబ్లిక్ హెల్త్ కాంట్రాక్టు కార్మికులు మహిళలు, పురుషులకు మనిషికి 2జతలు చొప్పున జత 400 రూ॥లు విలువచేసే బాటా కంపెనీ చెప్పులను కార్మికులు మరియు నాయకులు సెలక్ట్ చేయటం జరిగింది. అలాగే సబ్బులు కూడా నెలాఖరులోగా ఇవ్వాలని సిఐటియు కోరింది. సబ్బులు, చెప్పులు ఇవ్వటానికి అంగీకరించిన జివిఎంసి కమీషనర్ హరినారాయణ్, జివిఎంసి అధికారులకు జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ధన్యవాదాలు తెలియజేస్తున్నది. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు ఎం.నాగేశ్వరావు, ఎస్.రమణ, ఈశ్వరరావు, కిషోర్, బాస్కర్, నయేమి, లక్ష్మికాంత, పాపలమ్మ, రాము, రాంబాబు మరియు వార్డు కార్మికులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి నిరోధకులు జగన్, పవన్ : వినుకొండ సుబ్రహ్మాణ్యం



విశాఖపట్నం: రాష్ట్రం విడిపోయి కష్టాల కడలిలో కొనసాగుతుండగా రాష్ట్ర ప్రభుత్వానికి చేయూత నిచ్చి కేంద్ర ప్రభుత్వ విధానాలను నిలదీయాల్సిన ప్రతిపక్ష పార్టీలు బిజెపికి తొత్తులుగా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని కష్టాలుపాలు చేయాలనుకోవడం సోచనీయం. పవన్ కళ్యాణ్ పార్ట్‌టైమ్ రాజకీయ నాయుకుడు, జగన్ ఫ్యాక్షన్ కుటుంబం నుండి వచ్చిన నాయకుడు ఇరువురుకీ ప్రజా సమస్యలు తెలియవన్నారు. ఈ రాష్ట్రంలో ప్రతిపక్షం తన పాత్రను పూర్తిగా మరచిందని, ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు న్యాయం చేయలేకపోతుందన్నారు. తిత్లీ తుఫాను బాధితులను ఆదుకోవాలన్న ఆలోచన కలగకపోవడం, బాధితులకు తన ముఖాన్ని చూపకుండా పారిపోయాడు. తన పాదయాత్రలో బిసిలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తూ ఆచరణకు సాధ్యంకాని హామీలు గుప్పిస్తున్నాడన్నారు. తిరిగి 2019లో ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీనే ఎన్నుకోబోతున్నారని, బిజెపి చెప్పినట్లు జగనం,పవనం ఆడుతున్నారని అందుకే వీరందరికీ చంద్రబాబు టార్గెటైపోయారన్నారు. ఈ పత్రికా విలేఖరుల సమావేశంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి దొడ్డి రామానంద్, 31వ డివిజన్ అధ్యక్షులు నున్న నాగేంద్ర పాల్గొన్నారు.

# అగనంపూడిలో జనసేన జనబాట



గాజువాక: నియోజకవర్గంలోని అగనంపూడి ప్రాంతంలో జనసేన నాయకులు తిప్పల రమణారెడ్డి ఆద్వర్యంలో జనసేన జనబాట ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. బుధవారం చేపట్టిన ఈ కార్యక్రమంలో తిప్పలనరమణారెడ్డి మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఆదేశాలమేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలని కోరారు. అగనంపూడి సంతలో ప్లాస్టిక్ వాడకంపై అవగాహన చేపట్టారు. సుమారు 1000 గుడ్డ సంచులను పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బాస్కరరాజు, ఆనంద్, పల్లారాజు, చంటి, సీతారాం, ప్రసాద్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భావితరాల భవిష్యత్తును నిర్ణయించేది ఓటర్లే

## – అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవలెను – 21వ వార్డులో ఓటరు నమోదు కార్యక్రమం

విశాఖపట్నం: భావితరాల భవిష్యత్తు, ఈ దేశ దశానిర్దేశం చేసేది ఓటర్లేనని విశాఖ దక్షిణ నియోకవర్గ వైఎస్ఆర్‌సిపి సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి పేర్కొనానరు. 21వ వార్డులోని శాలిపేటలో ఆ వార్డు అధ్యక్షుడు మాణిక్యాలరావు ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా దక్షిణ నియోజకవర్గ వైఎస్ ఆర్ సీపీ సమన్వయకర్త డా॥ పీవీఆర్ ముఖ్యఅతిధిగా హాజరై ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఓటు అనేది దేశ భవిష్యత్తును నిర్ణయింస్తుందని ఓటు ప్రతీ భారతీయుని హక్కు అని అన్నారు. ఓటు వేయడంతో దేశాన్ని పాలించే మంచి నేతలను ఎన్నుకోవచ్చునని తద్వారా దేశ, రాష్ట్ర ప్రంతాల ఉజ్వల భవిష్యత్తును నిర్ణయించే అవకాశం ఉంటుందని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ యువతీ యువకులు ఈ హక్కుని వినియోగించకపోవడం వలన రాజకీయ నాయకులు విజ్ఞత లేకుండా చట్టసభల్లో పాల్గొని పాలనను భ్రష్టు పట్టిస్తున్నారని అన్నారు. కావున మన దేశం బాగాండాలంటే ప్రతి యువత తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకుని మంచి రాజకీయ నాయకులను రాజ్యానికి అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ఆనందం, కనకరాజు, ఎస్. కుమారి, లీలా, దిలీప్, సభి, గౌస్ మరియు అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.



# మాజీ సర్పంచ్ కుటుంబానికి అండగా మేమున్నాం

## అయ్యన్న యువసేన అధ్యక్షులు చింతకాయల విజయ్

నాతవరం : స్వర్గస్తులైన వైబి అగ్రహారం మాజీ సర్పంచ్ వనిమిన సత్యనారాయణ కుటుంబానికి అండగా మేమున్నామని అయ్యన్న యువసేన అధ్యక్షులు చింతకాయల విజయ్ అన్నారు. బుధవారం ఇంటికి వెళ్లిన అయ్యన్న యువసేన అధ్యక్షుడు చింతకాయల విజయ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి నాతవరం మండలం వైబి అగ్రహారం గ్రామంలో పార్టీ జెండాని రెపరెపలాడించిన మాజీ సర్పంచ్ వనిమిన సత్యనారాయణ కుటుంబానికి అండగా ఉంటానని హమీ ఇచ్చారు. పార్టీ కోసం, నమ్ముకున్న ప్రజల కోసం ఆస్తుల అమ్ముకున్న నాయకులున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని చెప్పారు. తోటి కార్యకర్తను, తోటి నాయకులను కుటుంబ సభ్యులుగా భావించి అండగా నిలిచే సంస్కృతి ఒక్క తెలుగుదేశం పార్టీకే సాధ్యమన్నారు. దానికి నిదర్శనంగా నాతవరం పార్టీ నాయకులు ముందుకు వచ్చి రూ. 49,000 ఆర్థిక సహాయం చేయటం ఆదర్శప్రాయంగా అభివర్ణించాడు. విజయ్ వంతుగా రూ.28,000 మొత్తం కలిపి రూ. 77,000 రూపాయలు ఆ కుటుంబానికి అందచేసారు. అంతేకాకుండా సత్యనారాయణ అల్లుడుకి మంత్రి అయ్యన్నతో మాట్లాడి ఉద్యోగం ఇప్పిస్తామని కూడా హమీ ఇచ్చారుఈ కార్యక్రమంలో నాతవరం ఎంపిపి శింగంపల్లి సన్యాసిదేముడు, జెడ్పీటీసీ కరక సత్యనారాయణ, నాతవరం మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, తాండవ జలాశయ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అబ్బారావు, మండల సీనియర్ నాయకులు వనిమిన సూర్యారావు, వైస్ ఎంపిపి వీసం చిట్టిబాబు, తాండవ నీటి సంఘం డైరెక్టర్ చిటికెల రమణ, అప్పన విజయ్, ఎంపిటిసిలు బాపన్నాయుడు, శివ, నూకరాజు, నాతవరం మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పవనే నన్ను ఒప్పించారు





'జానీ' సినిమాలో హీరోయిన్‌గా నటించమంటే మొదట ఒప్పుకోలేదని అంటున్నారు నటి రేణూ దేశాయ్. పవన్ కల్యాణ్, రేణూ జంటగా నటించిన ఈ చిత్రం 2003లో విడుదలైంది. ఈ చిత్రానికి పవన్ కల్యాణే దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమాకు రేణూ తొలుత ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరించారు. ఆమె డిజైనర్‌గా వ్యవహరిస్తున్న సమయంలోనే హీరోయిన్‌గా నటించాలని పవన్ కోరారట. కానీ ఇందుకు తాను ఒప్పుకోలేదని, ఆ తర్వాత పవనే తనను ఒప్పించారని అన్నారు. ఈ విషయాన్ని రేణు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించారు. ' 'జానీ' సినిమాకు నేను తొలుత ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేశాను. షూటింగ్‌కి రెండు వారాల ముందు నన్ను హీరోయిన్‌గా ఎంపికచేశారు. హీరోయిన్ అనగానే నేను చెయ్యనని చెప్పేశా. ఎందుకంటే నాకు ప్రొడక్షన్ డిజైనింగ్, సాంకేతిక వర్గంపైనే ఆసక్తి ఉంది. అదీకాకుండా 21 ఏళ్లకే ప్రొడక్షన్ డిజైనర్‌గా, హీరోయిన్‌గా వ్యవహరించడం అంత సులువేం కాదు. కానీ పవన్ నన్ను ఎలాగోలా ఒప్పించారు. దాంతో ఏడు నెలల పాటు రోజుకు 17 గంటల పాటు పనిచేసేదాన్ని. ప్రొడక్షన్ డిజైనర్‌గా సెట్స్‌కు వచ్చి అన్ని పనులు చూసేదాన్ని. ఆ తర్వాత మేకప్ రూంకు వెళ్లి హీరోయిన్‌గా సిద్ధం అయ్యేదాన్ని. జీవితం మనకు ఏదన్నా సవాలు విసిరినప్పుడు భయపడి పారిపోకూడదు. ఆ సవాలును స్వీకరించాలి. అప్పుడే వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎంతో నేర్చుకుంటాం. ఈ ఫొటోలో నా వెనక ఉన్నది శ్యాం దాదా ( డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ). పవన్‌తో కలిసి సన్నివేశాలను చర్చిస్తున్నారు' అని వెల్లడిస్తూ అప్పటి విషయాలను గుర్తుచేసుకున్నారు రేణూ.

### దర్శకుడి బూతు భాగోతం బయటపెట్టి

# అమలా పాల్



మీటూ ఉద్యమం నేపథ్యంలో పలువురు స్టార్ హీరోయిన్లు సైతం తమకు ఎదురైన చేదు సంఘటనల గురించి ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడుతున్నారు. తాజాగా ఈ లిస్టులో సౌతిండియా స్టార్ హీరోయిన్లలో ఒకరైన అమలా పాల్ చేశారు. తమిళ దర్శకుడు సుశి గణేశన్ గురించి మీటూ ఉద్యమంలో భాగంగా సంచలన ఆరోపణలు చేశారు. సినిమా సెట్లో అతడి సెక్సువల్ మిస్‌కండక్ట్ చాలా దారుణంగా ఉంటుందని, ఇష్టం వచ్చినట్లు బూతులు మాట్లాడతాడని, డబుల్ మీనింగ్ కామెంట్స్ చేస్తూ ఇబ్బంది పెడతాడని అమలా పాల్ ఆరోపించారు.

సుశి గణేశన్ దర్శకత్వంలో అమలా పాల్ 'తిరుట్టు పాయలే 2' అనే సినిమాలో నటించారు. ఆ సమయంలో అతడి ప్రవర్తన వల్ల చాలా ఇబ్బంది పడ్డట్లు అమలా పాల్ తన మీటూ పోస్టు ద్వారా వెల్లడించారు. లీనాకు అమలా పాల్ మద్దతు తమిళ ఇండస్ట్రీకి చెందిన మహిళా దర్శకురాలు లీనా మణిమేకలై మీటూ ఉద్యమంలో భాగంగా దర్శకుడు సుశి గణేశన్ తనను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు చేశారు. లీనా తన పూర్తి మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా అమలా పాల్ స్పష్టం చేశారు. ఇలాంటి వాళ్లకు తగిన బుద్ధి చెప్పాలి కేవలం సినిమా పరిశ్రమలోనే కాదు... అన్ని చోట్ల మహిళలు ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి జరుగకుండా ప్రభుత్వం తరుపు నుంచి చర్యలు ఉంటే బావుంటుంది అని అమలా పాల్ అభిప్రాయ పడ్డారు. కాగా... మీటూ పోస్ట్ పెట్టిన కొంత సేపటి క్రితమే తనకు షాకింగ్ సంఘటన ఎదురైంది. సుశి గణేశన్, అతని భార్య మంజరి నాకు ఫోన్ చేశారు. ఈవిషయంలో నా స్టాండ్ ఏమిటో చెప్పాలని ఫోన్ లిఫ్ట్ చేసి మాట్లాడాను. మంజరితో నేను మాట్లాడుతుంటే... సుశి గణేశన్ ఇష్టం వచ్చినట్లు నన్నుతిట్టడం మొదలు పెట్టాడు.... అని అమలా పాల్ తెలిపారు. మీరు నన్ను భయ పెట్టలేరు మరో ఆశ్చర్యకర విషయం ఏంటంటే.. మంజరి వెటకారంగా నవ్వుతూ ఇద్దరూ కలిసి నా వ్యక్తిత్వాన్ని తప్పుబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి చెత్త ఐడియాలతో నన్ను భయపెట్టలేరు అని అమలా పాల్ తేల్చి చెప్పారు.

# చిత్రభాను

# నారా బ్రాహ్మణి ఆడ సింహం

నారా బ్రాహ్మణి ఆడ సింహంలాంటి వారు అంటూ బాలకృష్ణ కుమార్తెపై ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు సినీ నటుడు మంచు మనోజ్. తిత్లీ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన శ్రీకాకుళం జిల్లాలోని తొమ్మిది గ్రామాలను బ్రాహ్మణి దత్తత తీసుకున్నారు. ఈ విషయం గురించి ప్రస్తావిస్తూ మనోజ్ ఆమెను అభినందించారు. 'శ్రీకాకుళం కోసం నారా బ్రాహ్మణి తనవంతు సాయం చేయడం ఎంతో స్ఫూర్తిదాయకం. నాకు తెలిసిన దృఢమైన మహిళల్లో ఆమె ఒకరు. అవసరంలో ఉన్నవారి కోసం సాయం చేయడానికి ముందు రావడం నిజంగా అభినందించాల్సిన విషయం. సింహం బిడ్డ ఎప్పటికీ సింహమే.. జై బాలయ్య' అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

తిత్లీ కారణంగా శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయాయి. తుపాను కారణంగా జరిగిన ప్రమాదాల్లో దాదాపు ఎనిమిది మంది మృత్యువాతపడ్డారు. తిత్లీ బాధితుల కోసం ఎందరో సినీ ప్రముఖులు సాయం చేయడానికి ముందుకొచ్చారు. అల్లు అర్జున్, ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, రాజశేఖర్, విజయ్ దేవరకొండ తదితరులు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు అందించారు.







# సవ్యసాచి' ట్రైలర్ విడుదల

అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సవ్యసాచి'. చందూ మొండేటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. బాలీవుడ్ నటి నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను ఈరోజు విడుదల చేశారు. 'ప్రేమ, కోపంలాంటి భావోద్వేగాలు మీకొస్తే మీరు మాత్రమే రియాక్ట్ అవుతారు. అదే నాకొస్తే నాతో పాటు ఇంకొకడు కూడా రియాక్ట్ అవుతాడు. వాడే నా ఎడమ చెయ్యి' అన్న డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. నాగచైతన్యకు తెలీకుండానే అతని ఎడమ చెయ్యి రియాక్ట్ అవడం ట్రైలర్‌లో ఫన్నీగా చూపించారు. ఇందులో మాధవన్ ప్రతినాయకుడి పాత్ర పోషించారు. నాగచైతన్యను, అతని కుటుంబాన్ని టార్చర్ చేస్తుంటారు. స్పృహకోల్పోయిన నాగచైతన్యను చూస్తూ 'వీడ్ని చూస్తుంటే పద్మవ్యూహంలో పడిపోయిన అభిమన్యుడులా ఉన్నాడు కదూ..' అని మాధవన్ అంటారు. ఇందుకు పక్కనే ఉన్న తాగుబోతు రమేశ్ స్పందిస్తూ..'మీరన్నది కరక్టే సర్. కానీ అతను అభిమన్యుడు కాడు. అర్జునుడు' అని చెప్పడం ఆకట్టుకుంటోంది. 'చావైనా నిన్ను చేరాలంటే అది నీ ఎడమ చెయ్యి దాటి రావాలి' అంటూ రావు రమేశ్ చెప్తున్న డైలాగ్ హైలైట్‌గా నిలిచింది.

భూమిక..నాగచైతన్యకు అక్క పాత్రలో నటించారు. ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందించారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నవీన్, రవి, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్నారు. నవంబర్ 2న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

# ఎంత రిక్వెస్ట్ చేసినా నయనతార ఒప్పుకోలేదు..



దర్శకుడు మారుతి ఈరోజుల్లో, బస్టాప్, ప్రేమ కథా చిత్రం, భలే భలే మగాడివోయ్ వంటి చిత్రాలతో మారుతి టాలీవుడ్ లో దర్శకుడిగా ప్రత్యేకమైన గుర్తింపు పొందారు. అయన చిత్రాలు అద్భుతమైన వినోదాన్ని అందించేవిగా ఉంటాయి. టాలీవుడ్ లో మారుతి మినిమమ్ గ్యారెంటీ దర్శకుడనే అభిప్రాయం ఏర్పడింది. మారుతి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన కెరీర్ గురించి, సినిమాల గురించి ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. బాబు బంగారం చిత్రంలో క్లైమాక్స్ లో ఇంకొక పాట చిత్రికరించాల్సి ఉంది. కానీ నయనతార ఒప్పుకోకపోవడంతో ఆ సాంగ్ చిత్రీకరించకుండానే సినిమా విడుదల చేశాం అని మారుతి అన్నారు. ఎంత రిక్వస్ చేసినా నయనతార ఒప్పుకోలేదు. నాకు డేట్స్ లేవు. వేరే చిత్రాలతో బిజీగా ఉన్నా. నేను చేయను అంటూ చెప్పేశారు. అందుకే గొడవ కనీసం ఇది వెంకటేష్ లాంటి స్టార్ హీరో సినిమా అనే గౌరవాన్ని కూడా ఆమె ప్రదర్శించలేదు. నిర్మాతలు చాలా రిక్వస్ట్ చేశారు. నేను చేయను. ఇక మీ ఇష్టం అని తేల్చేశారు. ఆ విషయంలో నాకు చాలా బాధేసిందని మారుతి తెలిపాడు. ఆ విషయంలోనే నయనతారతో వివాదం చోటు చేసుకుందని తెలిపాడు. ఈ రోజుల్లో, బస్టాప్‌పై విమర్శలు ఈ రోజుల్లో,బస్టాప్ చిత్రాలపై వచ్చిన విమర్శల గురించి మారుతి స్పందించాడు. బయట యువత మొబైల్ ఫోన్స్, లాప్ టాప్స్ ని దుర్వినియోగం చేస్తున్న విధానాన్ని ఆ చిత్రాల్లో ఘాటుగా చూపించా. అందువలన కొంతమందికి ఆ చిత్రాలు నచ్చకపోయి ఉండవచ్చు అని మారుతి తెలిపాడు. తల్లిదండ్రుల కోసమే బస్టాప్, ఈ రోజుల్లో చిత్రాలతో పరోక్షంగా తాను తల్లిదండ్రులకు వార్నింగ్ ఇచ్చానని తెలిపాడు. తమ పిల్లలకు మొబైల్, లాప్ టాప్ వంటి అన్ని సౌకర్యాలని తల్లి దండ్రులు సమకూరుస్తారు. వాటిని పిల్లలు ఎలా దుర్వినియోగం చేస్తున్నారో తల్లిదండ్రులకు తెలియదు. ఆ విషయం వారికీ తెలియజేయాలి అంటే కొన్ని సన్నివేశాలు ఘాటుగానే చూపించాలి అని మారుతి అభిప్రాయపడ్డారు. నడుము కూడా చూపించలేదు ఎక్స్ ఫోజింగ్ ని వ్యతిరేకించే వారిలో తాను మొదటి వ్యక్తిని. రోజుల్లో, బస్టాప్ వంటి చిత్రాల్లో కూడా నేను ఎక్కడా హీరోయిన్ నడుము కూడా చూపించలేదు. ఎక్స్ ఫోజింగ్ చేయిస్తే ఆడియన్స్ థియేటర్స్ కు వస్తారనేది భ్రమ అని మారుతి తెలిపాడు. ఒక్కో చిత్రంలో ఒక్కో సందేశం తన చిత్రాలని గమనిస్తే అంతర్లీనంగా మంచి సందేశం ఉంటుందని మారుతి తెలిపాడు. చిన్న చిన్న విషయాలకు సూసైడ్ చేసుకోకూడదని ప్రేమ కథా చిత్రంలో, స్వార్థం ఉంటే వచ్చే ఇబ్బందులని కొత్త జంట చిత్రంలోచూపించానని మారుతి తెలిపాడు. భలే భలే మగాడివోయ్ చిత్రంలో లోపం ఉన్న వ్యక్తిని ప్రేమించవచ్చు అనే సందేశాన్ని ఇచ్చానని మారుతి వెల్లడించాడు.







# భారత్, వెస్టిండీస్ మ్యాచ్ టై

## మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విరాట్ కోహ్లీ





వైజాగ్: క్రికెట్ అభిమానులంతా ఊపిరి బిగపట్టుకొని చూసిన క్రికెట్ మ్యాచ్ చివరకు టై అయింది. భారత్, వెస్టిండీస్ మధ్య జరుగుతున్న మ్యాచ్ టై అయింది. 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి వెస్టిండీస్ 321 పరుగులు చేసింది. మ్యాచ్ ఆధ్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. భారత్ 6 వికెట్ల నష్టానికి 321 పరుగులు చేసి 322 పరుగుల లక్ష్యాన్ని వెస్టిండీస్ కు నిర్ధేశించింది. ఐదు వన్డేల సిరీస్ లో భారత్ 1-0 ఆధిక్యంలో ఉంది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియాకు ఓపెనర్లు రోహిత్ (4), ధావన్ (29) హ్యాండిచ్చినా.. కోహ్లి, రాయుడు ఆదుకున్నారు. ఈ ఇద్దరూ కలిసి మూడో వికెట్‌కు 139 పరుగులు జోడించారు. రాయుడు 73 పరుగులు చేసి ఔటవగా.. కోహ్లి మాత్రం తనదైన స్టయిల్లో రెచ్చిపోయి ఆడాడు. సెంచరీ వరకూ కాస్త ఆచితూచి ఆడినా.. మూడంకెల స్కోరు అందుకోగానే జోరు పెంచాడు. సెంచరీ తర్వాతే నాలుగు కళ్లు చెదిరే సిక్స్‌లు బాదాడు. చివరికి 129 బంతుల్లో 157 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. వన్డేల్లో 150, అంతకన్నా ఎక్కువ పరుగులు చేయడంలో కోహ్లికిది నాలుగోసారి. ఈ సెంచరీతో సచిన్ 49 సెంచరీల రికార్డుకు 12 అడుగుల దూరంలో నిలిచాడు. ఈ ఏడాది ఆడిన 11 మ్యాచుల్లో ఏకంగా 1060 పరుగులు చేశాడు విరాట్ కోహ్లి. అంటే దాదాపు వంద సగటుతో పరుగులు చేయడం విశేషం. 2018లో అటు టెస్టులు, ఇటు వన్డేల్లో రెండింట్లోనూ కోహ్లియే టాప్ స్కోరర్‌గా ఉన్నాడు.

### వీర విరాట్

హైదరాబాద్: నిజంగా.. కనీవినీ ఎరగని చరిత్రే ఇది. కేవలం 213 వన్డేల్లో 10,000 పరుగులు సాధించడమంటే కనీవినీ ఎరగని చరిత్ర కాక మరింకేమిటీ! పరుగుల రారాజుగా కీర్తించే సచిన్ తెందుల్కర్‌కే సాధ్యమవ్వని ఘనత ఇది. అత్యంత వేగంగా అంతర్జాతీయ క్రికెట్‌లో పదివేల పరుగుల మైలురాయి చేరడమంటే మాటలా? ఎంత నిలకడ.. ఎంత దూకుడు.. ఎంత టెక్నిక్.. ఎంత ఓర్పు.. ఎంత శ్రమ.. ఎంత కోరిక.. ఎంత కసి.. చెప్పుకొంటూ పోతే ఇలా ఎన్ని ఎంతలు వచ్చేస్తాయో టీమిండియా సారథి విరాట్ కోహ్లీ గురించి. సచిన్ పరుగుల వరదను చూసి ఇలాంటి ఆటగాడు మరొకరు వస్తారా? అనుకున్నారు. ఆ రికార్డులు బద్దలు కొట్టే ఇంకో వీరుడిని చూడగలమా? అని సందేహించారు! 2008లో అండర్-19 ప్రపంచకప్ అందించి టీమిండియాలోకి అడుగుపెట్టిన కుర్ర కోహ్లీని చూసి అరె బాగా ఆడుతున్నాడే అనుకున్నారు అంతా! అతడే తనలో ఎన్నో మార్పులు చేసుకొని ఇంతింతై వటుడింతై అన్న చందంగా సచిన్ రికార్డులను ఒక్కొక్కటిగా బద్దలు కొడుతూ ఔరా! అనిపిస్తాడని ఊహించలేకపోయారు.

తొలి పది మ్యాచుల్లో తన అసలైన ప్రతిభ చూపని కోహ్లీ ఆ తర్వాత చిచ్చర పిడుగులా చెలరేగాడు. మైదానంలో సునామీ సృష్టించాడు. బౌలర్ ఎవరన్న చూసేది లేదు. ఉపఖండమా? ఆస్ట్రేలియా? ఇంగ్లాండా? దక్షిణాఫ్రికానా? అన్న భయం లేదు. విమర్శలనే ఇటుకలను ఒక్కో మెట్టుగా పేర్చాడు. తనను తాను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకున్నాడు. సచిన్‌తో పోల్చేలా ఆడాడు. ఇప్పుడు సచిన్ పదివేల పరుగుల రికార్డునూ తుడిచిపెట్టేశాడు. విండీస్‌తో జరుగుతున్న రెండో వన్డేలో 81 పరుగులు చేసి అత్యంత వేగంగా అంతర్జాతీయ వన్డేల్లో పదివేల పరుగుల శిఖరాన్ని అధిరోహించిన క్రికెట్ యోధుడిగా మరో చరిత్ర సృష్టించాడు. తన ఆరాధ్యదైవం సచిన్ 266 వన్డేల్లో ఈ ఘనత సాధించగా కోహ్లీ కేవలం 213 మాత్రమే తీసుకోవడం విశేషం.



## తిత్లీపై కేంద్రం స్పందించకపోవడం దారుణం

అమరావతి: తితలీ తుపాను కారణంగా రూ. 4300 కోట్ల మేర నష్టం వాటిల్లిందని హోం మంత్రి చినరాజప్ప వెల్లడించారు. పునరావాస చర్యల కోసం రూ. 1200 కోట్లు తక్షణ సాయం చేయాలని కేంద్రాన్ని కోరామని చెప్పారు. తుపానుతో భారీ నష్టం జరిగినా కేంద్రం స్పందించకపోవడం దారుణం అన్నారు. ఈనెల 26 నుంచి 30వ తేదీలోగా బాధితులకు నష్ట పరిహారం అందజేస్తామని హోం మంత్రి తెలిపారు. సీబీఐ వ్యవహారాల్లో కేంద్రం జోక్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సీబీఐ వివాదంతో ఈ విషయం తేటతెల్లమైందన్నారు. రాజకీయ కక్ష సాధింపులకు సీబీఐని బీజేపీ వాడుకుంటోందని చినరాజప్ప ఆరోపించారు.

## నవంబర్ 21న లేడీస్ పిక్నిక్



విశాఖపట్నం: వైజాగ్ కిట్టి మరియు వీ-టీమ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున లేడీస్ పిక్నిక్ నిర్వహిస్తున్నామని వీరు మామ తెలిపారు. వైజాగ్ కిట్టి ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అలాగే సుమారు వెయ్యి మంది వస్తారని, మరిన్ని వివరాలకు 9000594866 నెంబరులో సంప్రదించవచ్చునని తెలిపారు. ఈవెంట్‌కి సంబంధించిన గోడ పత్రికను వైజాగ్ కిట్టి బోర్డు సభ్యులు ఆవిష్కరించారు.

## ప్రధానికి ఎంపీ రామ్మోహన్ నాయుడు లేఖ

హైదరాబాద్: ప్రధాని మోదీ, హోంమంత్రికి ఎంపీ రామ్మోహన్ నాయుడు లేఖ రాశారు. తితలీ తుపానుతో నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ తుపానుతో సిక్కోలు జిల్లా 40 సంవత్సరాలు వెనక్కి పోయిందని తెలిపారు. నష్టంపై సాయం కోరినా కేంద్రప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కక్ష సాధింపులో భాగమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ విబేధాలకు ఇది సమయం కాదని, కేంద్ర తమ ఆవేదను పట్టించుకోకపోకపోతే అందుకు ఫలితం తప్పదన్నారు రామ్మోహన్ నాయుడు. రాజకీయాలు పక్కన పెట్టి సిక్కోలు అభివృద్ధికి వైసీపీ, జనసేన కలిసిరావాలని, అందరం కలిసి ప్రధానిని నిలదీద్దామని రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు.

# రాహుల్ ప్రధాని కాగానే ప్రత్యేక హోదా తథ్యం

- దిగ్విజయంగా ఇంటింటికీ కార్యక్రమం
- మోదీ, బాబుతో దేశానికి ఒరిగేదేమీ లేదు
- ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలి
- రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉమెన్ చాంది



ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న కేరళ మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉమెన్ చాంది

విశాఖపట్నం: ప్రధానమంత్రిగా రాహుల్‌గాంధీ ఖాయం. ఏపీకి ప్రత్యేక హోదా తథ్యం అని కేరళ మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉమెన్ చాంది అన్నారు. ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా దక్షిణ నియోజకవర్గంలో ఇంటింటికీ కాంగ్రెస్‌ను శాసనసభ మాజీ సభ్యులు, పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు సారథ్యంలో వైశాఖి జల ఉద్యానవనం దగ్గర ఉమెన్ చాంది బుధవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఉమెన్‌చాంది మాట్లాడుతూ దేశానికి రాహుల్ గాంధీ సారథ్యం ఎంతైన అవసరమని అన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని కాగానే ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడం తథ్యమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, చంద్రబాబు వల్ల దేశానికి, రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని అన్నారు. పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి మాట్లాడుతూ నరేంద్రమోదీ ఒకనాడు విశాఖపట్నం వచ్చినప్పుడు చంద్రబాబు నాయుడు మేమిద్దరం ఒక్కటేనని గొప్పగా చెప్పుకున్నారని, అదే చంద్రబాబు నాయుడు నేడు నరేంద్రమోదీని విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి రాహుల్ గాంధీ ఇంటింటికీ కాంగ్రెస్ చేపట్టాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో ఈ కార్యక్రమం దిగ్విజయంగా జరుగుతుందని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రకృతి విలయతాండవం చేస్తే అతలాకుతలం అయిపోయిన ఆ ప్రాంతాన్ని ఇంతవరకు ప్రతిపక్ష నేత పక్కా జిల్లాలో ఉండీ కూడా కన్నెత్తి చూడకపోవడం హేయమైనదన్నారు. కార్యక్రమ నిర్వాహకులు , దక్షిణ నియోజవర్గం శాసనసభ మాజీ సభ్యులు, పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు మాట్లాడుతూ నియోకవర్గం శాసనసభ సభ్యుడిగా నా తండ్రి ద్రోణంరాజు సత్యనారాయణ అభివృద్ధి చేసి అకాల మరణం చెందితే ఈ నియోజకవర్గం ప్రజలు నమ్మకంతో నన్ను శాసనసభ్యుడిగా ఎన్నుకున్నారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమం కార్యకర్తల నినాదాలతో పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడివరకు జరిగింది. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి గిడుగు రుద్రరాజు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాకేష్ రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఎస్ఎన్ రాజా, నగర మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, మాజీ వుడా చైర్మన్ రాజు, లీగల్ సెల్ నాయకులు వజ్జిపర్తి శ్రీనివాస్, సేవాదళ్ చైర్మన్ పెంటపల్లి సత్యనారాయణ, బీసీ సెల్ చైర్మన్ కొణతాల శ్రీనివాస్, తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జిలు జగ్గపల్లి అప్పలరాజు, గుత్తుల శ్రీనివాస్, లింగం శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు ఆలేటి హేమలత, కాంగ్రెస్ నాయకులు పడాల శ్రీనివాసరెడ్డి, కొక్కిరి నూకరాజు, బమ్మిడి గంగాధర్, కర్రి రామారెడ్డి, మళ్ల ఈశ్వరరావు, ఆడారి రామకృష్ణ, కొణతాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు అభివృద్ధికి బ్యాంకులు పని చేయాలి

అమరావతి: ప్రైవేట్ రంగ బ్యాంకులు కూడా వ్యవసాయ, ఇతర రుణాలు ఇచ్చే విషయంలో ముందుకు రావాలని సీఎం చంద్రబాబు బ్యాంకర్లను కోరారు. నిర్దేశిత రుణ ప్రణాళికకు అనుగుణంగా బ్యాంకులు లక్ష్యాలను పూర్తి చేసి, ఫలితాలు సాధించడం ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. సీఎం అధ్యక్షతన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ మంగళవారం సమావేశమైంది. వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా వ్యవసాయ రంగానికి ఈ ఏడాది రూ.1,01,564 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా మొదటి త్రైమాసికంలో రూ.31,007 కోట్లు ఇచ్చామని బ్యాంకు అధికారులు సీఎంకు తెలిపారు. బ్యాంకర్లు ఎంఎస్ఎంఈలకు తొలి త్రైమాసికంలో రూ.9,715 కోట్ల రుణాలు ఇవ్వగా 34.38శాతం లక్ష్యాన్ని సాధించామని చెప్పారు. మిగిలిన ప్రాధాన్య రంగాలకు తొలి త్రైమాసికంలో రూ.2,035 కోట్ల రుణాలు ఇవ్వగా, 14.14 శాతం లక్ష్యాన్ని చేరుకున్నట్లు వివరించారు.

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750

## డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్ మూర్తికి ఇండియన్ బ్యాంక్ నివాళి



సాగర్‌నగర్: గీతం అధ్యక్షుడు, స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తికి ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సుధాకర్, ఎజిఎమ్ రామచంద్రరావు బుధవారం నివాళులర్పించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి వచ్చిన ఇండియన్ బ్యాంక్ అధికారులు డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి చిత్ర పటం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్. ప్రసాదరావు, గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్. గంగాదరరావు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎమ్. పోతరాజుకు ఇండియన్ బ్యాంక్ తరుపున సంతాప సందేశాన్ని అందజేశారు. కార్యక్రమంలో గీతం కార్యదర్శి బి.వి. మోహనరావు, ఛీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ కె.వి. గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## భావితరాల భవిష్యత్తును నిర్ణయించేది ఓటర్లే



విశాఖ సిటీ: భావి తరాల భవిష్యత్తు నిర్ణయించేది ఓటర్లేనని విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సమన్వయ కర్త డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తి పేర్కొన్నారు. 21వ వార్డులోని శాలిపేటలో ఆ వార్డు అధ్యక్షుడు మాణిక్యాలరావు ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డా. పీవీఆర్ ముఖ్య అతిధిగా హాజరై ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువత తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకుని మంచి రాజకీయ నాయకులను రాజ్యానికి అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ఆనంద్, కనకరాజు, ఎస్. కుమారి, లీలా, దిలీప్, నభి, గౌస్ మరియు అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com